# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 040-27624030, 27624031

# దెబోరా స్వరం

సంపుటి : 9 సంచిక : 4 | జూలై - ఆగష్టు 2016 | విడి ప్రతి వెల రూ. 5/-


## 11. ఓర్పు



జాయ్ చెరియన్

**సంపాదకురాలి కలము నుండి...**

'దెబోరాస్వరం' పాఠకులకందరికి క్రీస్తు నామములో శుభములు.

**'ఓర్పు'** అనేది ఆత్మ ఫలములలో ఒకటి. ప్రతి విశ్వాసి 'ఓర్పు' అనే సుగుణము కలిగియుండాలి. దీర్ఘశాంతము, సహనము ఓర్పునకు పర్యాయ పదములు. నీవు పరిశుద్ధాత్మతో నింపబడినప్పుడు 'ఓర్పు' అనే ఆత్మఫలమును పొందుతావు. జీవితములోని శ్రమలు ఎదుర్కొనడానికి ఓర్పు కావాలంటే సిలువలో వ్రేలాడుతున్న యేసయ్యను తలంచుకోవాలి. సిలువలో వ్రేలాడుతూ కూడ పాపాత్ములు తనకు వ్యతిరేకముగా చేసిన తిరుగుబాటు అంతటిని ఓర్చుకొనిన ఆయనను తలంచుకోవాలి.

**"మీరు అలసట పడకయు మీ ప్రాణములు విసుకకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగ చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి."** - హెబ్రీ 12:3

క్రీ.పూ. దాదాపు 700 సంవత్సరాల క్రితమే యెషయా ప్రవక్త ఆయన సిలువ మరణమునుగూర్చి ప్రవచించాడు.

**"మనమందరము గొఱ్ఱలవలె త్రోవ తప్పిపోతిమి మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను బాధింపబడినను అతడు నోరు తెరవలేదు వధకు తేబడు గొఱ్ఱపిల్లయు బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు. అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను."**

- యెషయా 53:6-8

ప్రభువును నిందించారు, హింసించారు, అన్యాయపు తీర్పు తీర్చారు, పిడిగుద్దులు గుద్దారు ముఖముమీద ఉమ్మివేశారు. ఆకాశమునకు భూమికి మధ్యలో మండుటెండలో సిలువలో వ్రేలాడు తున్నాడు. తలపై ముళ్ల కిరీటము, దేహమంతా రక్తసిక్తమై యుంది. కాళ్లు చేతులలో మేకులు దిగగొట్టారు. సిలువలో చిత్రహింసలు అనుభవిస్తూ కూడ దూషించువారిని బదులు దూషింపలేదు. బాధింపబడినను నోరు తెరువలేదు. యేసు ప్రభువు సిలువలో చూపిన ఆ దీర్ఘశాంతమును నీవు కలిగియుండాలి. శ్రమపడుతూ కూడ తన సమాధానము కోల్పోలేదు. నీ జీవితములో ఇట్టి సహనము కలిగియుండాలి. ఆ ప్రభువునే మాదిరిగా ఉంచుకొని ముందుకు సాగాలి.

**"ఓర్పు గొప్ప ద్రోహకార్యములు జరుగకుండ చేయును."**

- ప్రసంగి 10:4

**"మీరు మీ ఓర్పు చేత మీ ప్రాణములను దక్కించుకొందురు."**

- లూకా 21:19

కుటుంబములో సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొనే శక్తిలేక శ్రమలు సహించే ఓర్పులేక చాలా మంది ఆత్మహత్య చేసికుంటారు. ఓర్పు లేనందుకే లోకములో ద్రోహకార్యములు జరుగుతున్నాయి. దుర్మార్గుడైన భర్తను ఓర్చుకొనే శక్తి భార్యకుండదు; గయ్యాళియైన భార్యను ఓర్చుకొనే శక్తి భర్తకు ఉండదు. కలిసియుండలేక విడిపోతారు. కుటుంబములు విచ్ఛిన్నమవకుండ పాడవకుండ ఉండాలంటే ఓర్పు ఎంతో అవసరము. దైవభయముతో ప్రార్థనతో ఓర్పుతో నేర్పుతో కుటుంబమును ముందుకు నడిపించాలి. అట్టి కుటుంబములు దేవుని దీవెనలు పొందుతాయి. దేవుని దివ్యమైన సమాధానము ఆయన సన్నిధి కుటుంబములో ఉంటుంది.

**"నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి."**

- యాకోబు 1:2-4

శ్రమలు, శోధనలు సహించడముద్వారా ఓర్పు అనే గొప్ప ఆత్మఫలమును పొందుతావు. కావున మీరు శోధనలో పడునప్పుడు అది మీ విశ్వాసమును పరీక్షిస్తుందని గ్రహించి అది మహానందమని యెంచుకోవాలని యాకోబు భక్తుడు సెలవిస్తున్నాడు. మీరు సంపూర్ణులు ఏ విషయములో కొదువలేనివారుగా ఉండునట్లు ఓర్పు తన క్రియను

కొనసాగిస్తుంది. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్) సంఘము ఆరంభించి 24 సంవత్సరాలు పూర్తి అయిందంటే, సంఘము ఇంతగా అభివృద్ధి పొందిందంటే ఏదో పుట్టగొడుగులా అప్పటికి అప్పుడు పుట్టుకొచ్చింది కాదు. దీని వెనుక ఎంతో ఓర్పు, సహనము ఉంది. ఎన్నో నిందలు, అవమానములు, వ్యతిరేకత అనుభవించాను. శారీరకముగా, మానసికముగా వేదనపడ్డాను. శ్రమపడినందుకే ఈ రోజు ఇంత గొప్ప ఆత్మలపంటను చూడగలుగుతున్నాము.

కార్యసాధనకు ఓర్పు ఎంతో అవసరము. కోడిగ్రుడ్డు 21 రోజులు ఓర్చుకుంటే పిల్ల అవుతుంది. ఓర్చుకుంటే ఓరుగల్లు పట్టణము నీదవుతుందని అంటారు. శోధనలు శ్రమలు ఎదురైనప్పుడు భయపడి పారిపోవడము సరి కాదు. మా ప్రాణము అలసట పడకయు విసుకకయు ఉండునట్లు ప్రభువును తలంచుకోవాలి. ప్రభువు ఆనాడు సిలువలో తన ఓర్పును కోల్పోతే ఈనాడు మనకు రక్షణ వుండేది కాదు. ఆయన బాధింపబడినను నోరు తెరువలేదు. కొందరు స్త్రీలకు ఓర్పులేక చిన్న చిన్న గొడవలకే కుటుంబము విడచి పుట్టింటికి వెళ్లిపోతారు. కాని అక్కడ నీకు అవమానమే ఎదురవుతుంది. నీ కుటుంబము ఆశీర్వదింపబడాలంటే నిన్ను నీవు తగ్గించుకొని ఓర్పు కలిగియుండాలి. శ్రమలు సహిస్తు విశ్వాసముతో ప్రార్థించినప్పుడు దేవుడు తప్పక నిన్ను కనికరించి నీ కుటుంబమును ఆశీర్వదిస్తాడు. శ్రమలో నీకు తోడైయుండి ఆ శ్రమలో నుండి విడిపిస్తాడు. అందుకే శ్రమలయందు ఆనందించడము నేర్చుకోవాలి.

**"అంతే కాదు; శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయపడుదము."**

– రోమా 5:3,4

కొందరికి ఓర్పు లేక తొందరగా కోపగిస్తారు. కాని పరిశుద్ధ గ్రంథములో **"ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను."** – యాకోబు 1:19 అని ఉంది.

కొందరికి ఎప్పుడు చూసినా హడావుడి తొందరపాటే, వివేచింపక మాట్లాడేస్తారు. మనము విశ్వాసులుగా ప్రతి విషయము ఓపికగా వినాలి. నిదానముగా ఆలోచించి మాట్లాడాలి. నిదానమే ప్రధానము అని పెద్దలంటారు. రహదారులపై కూడ 'నిదానమే ప్రధానము' అనే బోర్డులు కన్పిస్తాయి. మనము మనకు ముందున్న ప్రవక్తలను, వారి శ్రమానుభవమును, వారు చూపిన ఓపికను మాదిరిగా పెట్టుకోవాలి.

**"సహోదరులారా, ప్రభువు రాకడవరకు ఓపిక కలిగియుండుడి; చూడుడి; వ్యవసాయకుడు తొలకరి వర్షమును కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన భూఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దానికొరకు కనిపెట్టును గదా. ప్రభువురాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి. సహోదరులారా, మీరు తీర్పు పొందకుండు నిమిత్తము ఒకనిమీదనొకడు సణగకుడి; ఇదిగో న్యాయాధిపతి వాకిట నిలిచియున్నాడు. నా సహోదరులారా, ప్రభువు నామమున బోధించిన ప్రవక్తలను, శ్రమానుభవమునకును ఓపికకును మాదిరిగా పెట్టుకొనుడి. సహించినవారిని ధన్యులనుకొనుచున్నాము గదా? మీరు యోబుయొక్క సహనమునుగూర్చి వింటిరి. ఆయన ఎంతో జాలియు కనికరమును గలవాడని మీరు తెలిసికొనియున్నారు."** – యాకోబు 5:7-11

వ్యవసాయకుడు విత్తనము వేసి పంటకొరకు ఓపికతో ఎదురు చూస్తాడు. అలాగుననే విశ్వాసి దేవుని కార్యముల నెరవేర్పుకొరకు, ప్రార్థనకు జవాబు పొందడానికి ఓపికతో కనిపెట్టాలి. యోబు అన్ని శ్రమలనుభవించినా తన సహనమును విశ్వాసమును కోల్పోలేదు. ఎప్పుడూ దేవుని దూషించలేదు. దేవునిగూర్చి యుక్తమైన మాటలు మాట్లాడాడు. దేవుడు యోబును రెండంతలుగా ఆశీర్వదించాడు. కోల్పోయిన ప్రతీది రెండంతలుగా పొందాడు.

శ్రమలు సహించడముద్వారా లభించే ఆశీర్వాదములలో ఒకటి ఓర్పు. ఒక యౌవనస్థుడు పాస్టర్ గారి దగ్గరకు వెళ్లి ఓర్పు పొందునట్లు నా కొరకు ప్రార్థించమన్నాడట. అయితే ఆ పాస్టర్ గారు అతనికి శ్రమలు దయచేయుమని ప్రార్థించాడు. నేను ఓర్పుకొరకు ప్రార్థించమంటే మీరు శ్రమలు కలుగాలని ప్రార్థించారెందుకు? అని ఆ యౌవనస్థుడు అడిగాడు. అప్పుడు పాస్టర్ గారు – శ్రమలు సహించినప్పుడే ఓర్పును పొందుతావు అని చెప్పాడు.

**"యెహోవాకొరకు నేను సహనముతో కనిపెట్టుకొంటిని ఆయన నాకు చెవియొగ్గి నా మొఱ్ఱ ఆలకించెను."** – కీర్తన 40:1

దీర్ఘకాలముగా ఏదైనా అంశముకొరకు ప్రార్థిస్తున్నావా? ప్రార్థనా ఫలముకొరకు ఎదురుచూస్తున్నావా? కొన్ని ప్రార్థనలకు వెంటనే జవాబురాదు. అయినను సహనముతో కనిపెట్టాలి. ధైర్యమును విశ్వాసమును విడిచిపెట్టకు; తప్పకుండ ఒకరోజు నా ప్రార్థనకు జవాబు పొందుతాననే ధృఢమైన విశ్వాసం దేవునియందు కలిగియుండాలి. నీ ప్రతి ప్రార్థన ఆయన సన్నిధికి చేరుతుంది. ఆలస్యము అలక్ష్యము కాదు.

మలేషియాలో బొంగు (వెదురు) సాగు చేసే రైతులు భూమిని చదును చేసి విత్తనములు చల్లి నీరు కట్టి ఎరువువేసి పంటకొరకు ఓపికతో ఎదురు చూస్తుంటారు. మొదటి సంవత్సరము ఏ ఫలము కనబడదు. అలాగే రెండవ సంవత్సరము, మూడవ సంవత్సరము, నాల్గవ సంవత్సరము ఎదురుచూస్తూనే ఉంటారు. శ్రమపడుతుంటారు గాని ఫలితము కనబడదు. ఐదవ సంవత్సరములో ఆ బొంగు కర్రలు 90 అడుగుల ఎత్తుకు పెరిగిపోతాయి. నాలుగు సంవత్సరాలు ఓపికతో కనిపెట్టి వారు పడిన ప్రయాసమునకు తగిన ఫలమును 5వ సంవత్సరంలో చూస్తారు. ఓర్పుతో కనిపెట్టి గొప్ప లాభము పొందుతారు.

**"కాబట్టి మీ ధైర్యమును విడిచిపెట్టకుడి; దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును. మీరు దేవుని చిత్తమును నెరవేర్చినవారై, వాగ్దానముపొందు నిమిత్తము మీకు ఓరిమి అవసరమై యున్నది."**

– హెబ్రీ 10:35,36

**"నిరీక్షణగలవారై సంతోషించుచు, శ్రమయందు ఓర్పుగలవారై, ప్రార్థనయందు పట్టుదల కలిగియుండుడి."** – రోమా 12:12

దేవుని చిత్తము నెరవేర్చాలన్నా, దేవుని వాగ్దానములు పొందాలన్నా ఓర్పు ఎంతో అవసరము. ఓర్పుచేతనే వాగ్దాన ఫలము పొందుతావు. అబ్రాహాము 25 సంవత్సరాలు కనిపెట్టిన తరువాత వాగ్దాన పుత్రుడైన

ఇస్సాకును పొందాడు. అనేకులు ఉత్సాహముగా ప్రభువును వెంబడిస్తారు. శ్రమలు రాగానే వెనుకడుగు వేస్తారు. అట్టివారి వలన దేవుడు సంతోషించడు. ప్రభువునందు మీ ప్రయాసము ఏనాడు వ్యర్థము కాదని యెరిగి ఆసక్తితో ఆత్మయందు తీవ్రత కలిగి ప్రభువును సేవించాలి. శ్రమలయందు ఓర్పుగలవారై ప్రార్థనలో పట్టుదల కలిగియుండాలి. నీ శ్రమకు తగిన ఫలము చూస్తావనే నిశ్చయతతో ముందుకు సాగాలి. ఇతరులకు మేలు చేయాలన్నా, కీడు చేసిన వారిని ప్రేమించాలన్నా సహనం చాలా అవసరము. విసుగక మేలు చేస్తే తగిన కాలమందు పంటకోస్తాము.

ప్రతిభారమును సుళువుగా చిక్కులు పెట్టు ప్రతి పాపము విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయైన యేసువైపు చూస్తూ మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తాలని పౌలు భక్తుడంటున్నాడు.

**"ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున మనముకూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు."**

- హెబ్రీ 12:1,2

యేసుక్రీస్తు విశ్వాసము, నిరీక్షణ, ఓర్పు, ఆదరణ, ప్రేమ, సమాధానములకు కర్త. కావున ఆయనలో నీకు విస్తారమైన నిరీక్షణ ఉంది. నీవు ఇతరుల మారుమనస్సు, రక్షణకొరకు ప్రార్థించినప్పుడు నీ నిరీక్షణను కోల్పోవద్దు. ప్రార్థనయందు పట్టుదల కలిగి నిరీక్షణయందు సంతోషించాలి. విశ్వాసి పరిశుద్ధాత్మ శక్తిచేత నింపబడినప్పుడే ఓర్పు, దీర్ఘశాంతము, సంతోషము, ప్రేమ, సమాధానము వంటి ఆత్మఫలములు ఉద్భవిస్తాయి.

**"కాగా మీరు పరిశుద్ధాత్మ శక్తి పొంది, విస్తారముగా నిరీక్షణ గలవారగుటకు నిరీక్షణకర్తయగు దేవుడు విశ్వాసము ద్వారా సమస్తా నందముతోను సమాధానముతోను మిమ్మును నింపునుగాక."**

- రోమా 15:13

**"కాబట్టి, మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని, ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలుకొనుచున్నాను."**

- ఎఫెసీ 4:1-3

విశ్వాస జీవితమును కాపాడుకోవాలన్నా, నీ పిలుపును ఏర్పాటును కాపాడుకోవాలన్నా, సంఘము మరియు కుటుంబము కట్టబడాలన్నా, దేవునికొరకు ఘనమైన కార్యములు చేయాలన్నా ఓర్పు ఎంతో అవసరము. పరిశుద్ధాత్మద్వారా నీలో ఉద్భవించే ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము అనే ఆత్మ ఫలములు కలిగియుండి ఐక్యతను కాపాడుకుంటూ సాత్వికముతోను సంపూర్ణ వినయముతోను నడుచుకోవాలని మిమ్మును బతిమాలుతున్నాను అని పౌలు భక్తుడు అంటున్నాడు. ఎందుకంటే ఓర్పు, ప్రేమ, ఐక్యత లేకుంటే సంఘమైనా కుటుంబమైనా చీలిపోతుంది. ఒకరిని ఒకరు ప్రేమిస్తూ సహిస్తు ముందుకు సాగాలి. దేవుడప్పగించిన బాధ్యతలు నమ్మకముగా నిర్వహించాలి. ఎదురుశక్తులు, పోరాటములు, నిందలు, అవమానములు తప్పక ఉంటాయి గాని ఓర్పుతో సహిస్తూ యేసువైపు చూస్తూ ముందుకు సాగినప్పుడు దేవుడు అన్నిటిలో నీకు అత్యధికమైన విజయం అనుగ్రహిస్తాడు. దేవునికి స్తోత్రం! హల్లెలూయ!!

**ప్రార్థన:** కృపగల దేవా, అవమానము నిర్లక్ష్యపెట్టి సిలువను సహించిన నిన్ను మాదిరిగా పెట్టుకొని మా విశ్వాసయాత్రలో ఓర్పుతో ముందుకు సాగే కృప నివ్వండి. శ్రమ ఓర్పును కలుగజేస్తుంది. గనుక శ్రమలయందు ఆనందించుట నేర్పించుమని, ఓర్పుతో నీవు మాకిచ్చిన బాధ్యతలు నమ్మకముగా చేయడానికి సహాయము చేయుమని యేసునామములో అడుగుతున్నాము తండ్రీ - ఆమేన్. ❀


## యు.పి.ఎఫ్. ఇంగ్లీషు ఆరాధన

యు.పి.ఎఫ్. **ఇంగ్లీషు ఆరాధన** ప్రతి ఆదివారము
సా॥ 4 గం॥ల నుండి 6 గం॥ల వరకు
ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, అడిక్‌మెట్‌లో జరుగును.
అనంతరం సా॥ 6 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు
**తెలుగు ఆరాధన** జరుగునని తెలియజేస్తున్నాము.

**అందరికీ ఆహ్వానము** - జాయ్ చెరియన్



## దయచేసి గమనించండి

UPF Ph. 040-27624030, 27624031

"యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్" పరిచర్యలకు మీరు పంపదలచిన విరాళాలను బ్యాంకు ద్వారా మాకు పంపగలరు.
మీరు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని దేవుని సేవలో తోడ్పడగలరు.
బ్యాంకు మరియు ఖాతా వివరాలు :

**United Peoples Fellowship, Current a/c no. 13391100000946 Andhra Bank, Ramnagar.**

**IFSC Code ANDB0001339** ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ **ANDB0001339**

ఆన్‌లైన్ ద్వారా విరాళము పంపేవారు పంపిన తేది, పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తెలియపరచగలరు.

# దేవుని సహస్రనామములు

## 245. యెహోవా బాహువా - యెషయా 51:9

**"యెహోవా బాహువా, లెమ్ము లెమ్ము బలము తొడుగుకొమ్ము పూర్వపు కాలములలోను పురాతన తరములలోను లేచినట్లు లెమ్ము రాహాబును తుత్తునియలుగా నరికివేసినవాడవు నీవే గదా? మకరమును పొడిచినవాడవు నీవే గదా? అగాధ జలములుగల సముద్రమును ఇంకిపోజేసినవాడవు నీవే గదా? విమోచింపబడినవారు దాటిపోవునట్లు సముద్రాగాధ స్థలములను త్రోవగా చేసినవాడవు నీవే గదా?"** - యెషయా 51:9,10

**యెహోవా బాహువా,** ఈ నామము క్రొత్తగా ఉందికదా. ఇక్కడ ప్రవక్త దేవుడిని యెహోవా బాహువా, అని పిలుస్తున్నాడు. దేవుడు ఎంతో శక్తిగలవాడు. ఆయన బాహువుకూడ శక్తిగలది. యెహోవా బాహువు ఏయే కార్యములు చేసిందో ప్రవక్త ఇక్కడ వివరిస్తున్నాడు. ఆయన హస్తము ఎంత బలమైనదో వివరిస్తున్నాడు. దేవుడిని పూర్తిగా పిలువడము లేదు కాని **యెహోవా, బాహువా** అని దేవుని హస్తమును కొనియాడుతున్నాడు. ఆయన బాహువులో ఎంతశక్తి వుందో వివరిస్తున్నాడు. ఈ నామమును ధ్యానించిన తరువాత మీరు దేనికీ భయపడరు.

**"శాశ్వతుడైన దేవుడు నీకు నివాసస్థలము నిత్యముగనుండు బాహువులు నీ క్రిందనుండును ఆయన నీ యెదుటనుండి శత్రువును వెళ్ళగొట్టి-నశింపజేయుమనెను."** - ద్వితీ.కాం. 33:27

యెహోవా, బాహువు బహుబలమైనది. యెహోవా హస్తము సాహస కార్యములను చేస్తుంది.

**"ఎట్లనగా యెహోవా బాహువు బలమైనదని భూనివాసులందరు తెలిసికొనుటకును, మీరు ఎల్లప్పుడును మీ దేవుడైన యెహోవాయందు భయభక్తులు నిలుపుటకును, మేము దాటువరకు మీ దేవుడైన యెహోవా తానే మాయెదుట ఎఱ్ఱసముద్రమును ఎండచేసినట్లు మీరు దాటువరకు మీ యెదుట యొర్దాను నీళ్లను ఎండచేసెనని చెప్పి యీ సంగతి వారికి తెలియపరచవలెను."** - యెహోషువ 4:23,24

శాశ్వతుడైన దేవుడు వారికి నివాసస్థలముగా ఉన్నాడు. నిత్యమైన ఆయన బాహువులు వారి క్రింద ఉన్నాయి. అంటే ఆయన బాహువులమీద నిన్ను మోస్తాడని అర్థము. నీ ఎదుటనుండి నీ శత్రువులను పారద్రోలుతాడు. ఈ లోకరీతిగా బలవంతులు తమ బాహువులో ఎంత బలముందో తమ చేతులు ఒక్కసారి బిగపట్టి తమ కండలు చూపిస్తారు. తమ బలాన్ని ప్రదర్శిస్తారు. సర్వశక్తిగల దేవుని బాహువులు ఎంతో బలమైనవి. ఆయన బలమైన బాహువుల్లో విశ్వాసి ఎంతో భద్రముగా వుంటాడు.

**"పక్షిరాజు తన గూడు రేపి తన పిల్లలపైని అల్లాడుచు రెక్కలు చాపుకొని వాటిని పట్టుకొని తన రెక్కలమీద వాటిని మోయునట్లు యెహోవా వానిని నడిపించెను."** - ద్వితీ.కాం. 32:11

పక్షిరాజు తన గూడును ఎప్పుడూ ఎత్తయిన పర్వతముమీద కడుతుంది. తన పిల్లలను ఎంతో భద్రముగా కాపాడుతుంది. పక్షిరాజు శత్రువు సర్పము. దానికి పక్షిరాజు గుడ్లు చాలా ఇష్టము. సర్పము బారినుండి తన పిల్లలను తప్పించడానికి ఎన్నో జాగ్రత్తలు తీసికుంటుంది. తండ్రి పక్షి గూడు దగ్గర ఉన్నప్పుడు తల్లి ఆహారము తీసికొనివస్తుంది. తల్లి పక్షి గూడు దగ్గర ఉంటే తండ్రి పక్షి ఆహారము తెస్తుంది. ఆహారము తేగానే పిల్లలు నోరు బాగా తెరచి ఆహారము అందుకొని తింటాయి. తింటు తింటూ ఎదిగిపోతాయి. రెక్కలు బలముగా అయిపోతాయి. అయినా ఎగురకుండ గూట్లోనే కూర్చుని తినడము అలవాటయిపోతుంది. తల్లి పక్షి పిల్లలమీద ప్రేమతో అలాగే తెచ్చి ఆహారము పెడుతుంటే పిల్ల పక్షులు ఏనాడు ఎగరడము నేర్చుకోలేవు. అందుకే పక్షిరాజు తన పిల్లలకు తర్ఫీదు నిస్తుంది. రెక్కలు ఎదగగానే గూడును చెదరగొడుతుంది. అప్పుడు పక్షిరాజు పిల్లలు పర్వత శిఖరము మీదనుండి పడిపోతు విలవిలలాడి పోతాయి. ఆ పిల్లలు అనుకుంటాయి ఇంక మా పని అయిపోయిందని కాని వెంటనే పక్షిరాజు తన పిల్లలను క్రింద పడనీయకుండ తన రెక్కలమీద మోస్తుంది. తిరిగి గూట్లో పెడుతుంది. మళ్ళీ గూడు చెదరగొట్టి క్రింద పడేస్తుంది. పడిపోయే సమయంలో తిరిగి రెక్కలపై మోస్తు తన పిల్లలకు ఎగరడానికి తర్ఫీదు నిస్తుంది.

కొన్నిసార్లు విశ్వాసులకు శ్రమలు సంభవించినప్పుడు ఇంక, మా పని అయిపోయింది. దేవుడు మా చెయ్యి వదిలేశాడనుకుంటారు. నీకు విశ్వాస జీవితములో మంచి తర్ఫీదు నివ్వడానికే ఈ శ్రమలు సంభవించాయనే జ్ఞానముండదు. శ్రమలలో దేవుడు నీ చేయి విడువడు. నీవు తట్టుకోలేనప్పుడు ఆయన రెక్కలతో నిన్ను మోస్తాడు. ఆయన బాహువుతో నిన్ను పట్టుకుంటాడు. నీకు సహాయము చేస్తాడు. నిన్ను విడువడు. నిన్ను ఎడబాయడు.

**"ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును."** - కీర్తన. 91:4

నీవు ప్రార్థన చేసేటప్పుడు **యెహోవా బాహువా** అని నామము ఎత్తి ప్రార్థించు. యెహోవా బాహువా, నీవు బాహుబలము గలవాడవు. మా అనారోగ్య పరిస్థితినుండి, ఆర్థిక ఇబ్బందులనుండి విడిపించగలవు. నీవు బాహుబలము గలవాడవు. మా భయాలన్నిటిలోనుండి విడిపించగలవు అని ప్రార్థించాలి. యెహోషాపాతు రాజు అదే రీతిగా ప్రార్థించాడు.

**"మా పితరుల దేవా యెహోవా, నీవు ఆకాశమందు దేవుడవై యున్నావు, అన్యజనుల రాజ్యములను ఏలువాడవు నీవే; నీవు బాహుబలము గలవాడవు, పరాక్రమము గలవాడవు, నిన్నెదిరించుట కెవరికిని బలము చాలదు."** - 2 దినవృత్తాం. 20:6

యెహోషాపాతు రాజు చిన్నరాజు. అతనిపైకి గొప్ప సైన్యము గల రాజులు దండెత్తి వస్తారని తెలిసినప్పుడు వారిని ఎదిరించడానికి మాకు శక్తి సరిపోదని దేవునికి ప్రార్థన చేస్తున్నాడు. తన ప్రార్థనలో దేవుని పరాక్రమమును బాహుబలమును కొనియాడుతూ స్తుతిస్తున్నాడు. దేవునియొక్క బాహువు యెహోషాపాతు రాజుకు తోడుగా ఉండి శత్రువులపై జయము అనుగ్రహించింది.

దేవుడు తన బాహుబలముచేత ఫరో బలమునుండి ఇశ్రాయేలీయులను విడిపించాడు.

**"యెహోవా బాహుబలముచేత మిమ్మును రప్పించి దాసుల గృహములో నుండియు ఐగుప్తురాజైన ఫరో చేతిలోనుండియు మిమ్మును విడిపించెను."** - ద్వితీ.కాం. 7:8

దేవుని ప్రజలను శత్రువుల బారినుండి విడిపించగలిగిన శక్తిగల బాహువు - యెహోవా బాహువు.

**"నా చెయ్యి యెడతెగక అతనికి తోడైయుండును నా బాహుబలము అతని బలపరచును. ఏ శత్రువును అతనిమీద జయము నొందడు దోషకారులు అతని బాధపరచరు."** - కీర్తన. 89:21,22

విశ్వాస జీవితములో ఎటువంటి పరిస్థితిలోకూడ బాహుబలము గలవాడు నీకు తోడైయుంటాడు. నిన్ను విడిపిస్తాడు. కనుక విశ్వాసి భయపడకూడదు. కొందరు విశ్వాసులని పేరే గాని ఊరికే భయపడుతుంటారు. శత్రువులు కీడు చేస్తారని, ఇరుగు పొరుగున ఉన్నవారు ఏదో హాని చేస్తారని, మంత్ర ప్రయోగము, చేతబడి చేశారని, పిల్లలు చదువకుండ, భార్య భర్తలకు మధ్య సమాధానము లేకుండా చేస్తున్నారని. ఇంట్లో సమాధానమే లేదు. ఎప్పుడూ ఏదో అల్లరి, అల్లకల్లోలము చెలరేగుతుందని భయపడుతున్నావా? యెహోవా

బాహువా మించిన బలముగల వాని చేతిలోనుండి మమ్మును విడిపించువాడా, మా సమస్యలలోనుండి మమ్మును విడిపించుమని ప్రార్థించినప్పుడు దేవుడు తన బలమైన బాహువు చాపి నీకు సహాయము చేస్తాడు.

**"దేవా, వచ్చుతరమునకు నీ బాహుబలమును గూర్చియు పుట్టబోవు వారికందరికి నీ శౌర్యమును గూర్చియు నేను తెలియజెప్పునట్లు తల నెరసి వృద్ధునైయుండువరకు నన్ను విడువకుము."** - కీర్తన. 71:18

కీర్తనకారుడికి ఒక గొప్ప గురి వుంది. వచ్చు తరమునకు, పుట్టబోవు వారికి దేవుని శౌర్యమును గూర్చియు బాహుబలము గూర్చియు తెలియ జేయడానికి తలనెరసి వృద్ధుడయ్యేవరకు నన్ను విడువకుమని ప్రార్థన చేస్తున్నాడు. దేవుని బాహుబలము కీర్తనకారుడి జీవితములో ఎన్ని ఆశ్చర్యకార్యములు జరిగించిందో, ఆయన బాహుబలము ఎంత గొప్పదో, ఆ భక్తుని ఎన్ని ఆటంకములనుండి తప్పించిందో రానున్న తరానికి ప్రకటించాలని ఆశిస్తున్నాడు. యెహోవా బాహువు శక్తి గలది. నీకు అసాధ్యమనిపించే సమస్యలలో ఈ నామముతో స్తుతించి ప్రార్థించు - సాధ్యమవుతుంది.

## 246. కీర్తనీయుడు

- ద్వితీ.కాం. 10:21

**"ఆయనే నీకు కీర్తనీయుడు. నీవు కన్నులార చూచుచుండగా భీకరమైన ఆ గొప్ప కార్యములను నీ కొరకు చేసిన నీ దేవుడు ఆయనే."**

- ద్వితీ.కాం. 10:21

కీర్తనీయుడు అంటే కీర్తనలు పాడదగిన వాడని, కీర్తనలతో పొగడదగిన వాడని అర్థము. ఆయనే మన కీర్తనీయుడు. నీ కీర్తనలకు ఆస్పదము ఆయనే.

**"ఇదిగో నా రక్షణకు కారణభూతుడగు దేవుడు, నేను భయపడక ఆయనను నమ్ముకొనుచున్నాను యెహోవా యెహోవాయే నాకు బలము ఆయనే నా కీర్తనకాస్పదము ఆయన నాకు రక్షణాధారమాయెను."** - యెషయా 12:2

**"యెహోవానుగూర్చి కీర్తన పాడుడి ఆయన తన మహాత్మ్యమును వెల్లడి పరచెను భూమియందంతటను ఇది తెలియబడును."** - యెషయా 12:5

భక్తులకు మరియు దేవుని పాటలకు ఎంతో సంబంధము వుంటుంది. మీరెప్పుడైన ఈ సత్యమును గమనించారా? భక్తి పెరిగితే వారి నోటినుండి పాటలు కీర్తనలు వస్తాయి. యు.పి.ఎఫ్.లో ప్రతి విశ్వాసి ఆత్మతో నింపబడి చప్పట్లు కొడుతు పాటలు పాడుతుంటే కీర్తనీయుడైన యెహోవా ఆత్మ సంచారము, సన్నిధి దిగివస్తుంది. ప్రతి ఒక్కరు సంతోషముతో ఆనందముతో గొంతెత్తి పాడి దేవుని స్తుతిస్తారు. రక్షణానందము ఎంతగా పెల్లుబికి వస్తుందంటే దానిని ఆపడానికి వీలు కలుగదు. మా సంఘములో ఒక సహోదరి గిలకతప్పెట వాయిస్తు పాట పాడుతు నాట్యమాడేది. దేవునికి స్తోత్రము కలుగును గాక. చెప్పశక్యము కాని ఈ గొప్ప సంతోషము నిమిత్తము దేవునికి కీర్తనలు పాడి స్తుతిస్తూ మహిమ పరుస్తున్నాము.

**"మనకు బలమైయున్న దేవునికి ఆనందగానము చేయుడి యాకోబు దేవునిబట్టి ఉత్సాహధ్వని చేయుడి. కీర్తన యెత్తుడి గిలకతప్పెట పట్టుకొనుడి. స్వరమండలమును మనోహరమైన సితారాను వాయించుడి."**- కీర్తన. 81:1,2

**"కీర్తనలతో నేను దేవుని నామమును స్తుతించెదను. కృతజ్ఞతాస్తుతులతో నేనాయనను ఘనపరచెదను ఎద్దుకంటెను, కొమ్ములును డెక్కలునుగల కోడెకంటెను అది యెహోవాకు ప్రీతికరము."** - కీర్తన. 69:30,31

దావీదు భక్తుడంటున్నాడు - నేను కీర్తనలతో దేవుని స్తుతిస్తున్నాను. కృతజ్ఞతాస్తుతులతో ఆయనను ఘనపరుస్తున్నాను. పెద్ద ఎద్దును తెచ్చి బలి ఇవ్వడముకంటె కొమ్ములు డెక్కలుగల కోడెను తెచ్చి అర్పించుటకంటె నా నోటినుండి అర్పించే కృతజ్ఞతాస్తుతులు దేవునికి ప్రీతికరము. నీ జిహ్వాఫలమును ఆయన కోరుకుంటున్నాడు. పాటలతో కీర్తనలతో దేవుని స్తుతించడానికి ఏనాడు వెనుకకు పోకూడదు. ఎందుకంటే ఆయనే కీర్తనీయుడు.

**"మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు యెహోవా గొప్పవాడును బహు కీర్తనీయుడునై యున్నాడు."** - కీర్తన. 48:1

పరిశుద్ధ గ్రంథములో - ఎఱ్ఱ సముద్రము దాటగానే ఇశ్రాయేలీయులు దేవుడనుగ్రహించిన జయమునుబట్టి దేవుని స్తుతిస్తూ కీర్తించారు. కీర్తనలు పాడారు. యెహోవాను గానము చేసెదము అని మిర్యాము తంబుర పట్టుకొని పాట పాడింది. దేవుడు చేసిన గొప్ప కార్యములను చూడగానే పాట నోటినుండి వచ్చేస్తుంది.

నన్ను కొంతమంది అడిగారు - అమ్మా, మీరు ఇంత గొప్ప చదువు చదివారు. గొప్ప విద్యావంతులు. ఇంత చిన్న కంజెర పట్టుకొని పాడటానికి చిన్నతనముగా లేదా? అని. కంజెర వాయిస్తూ పాట పాడటము నాకు గొప్ప సంతోషము. నేనేమాత్రము నామోషీగా అనుకోను. ఇది దేవుడు నాకిచ్చిన వాద్యమని చెప్పాను. ఇది జీవితాంతము నా చేతిలో ఉంటుంది. మోషే చేతిలో కర్ర పట్టుకున్నాడు. జాయ్ చెరియన్ చేతిలో కంజెర పట్టుకుంది. దీనిని వాయిస్తు పాడుతుంటే ఆత్మ కార్యములు జరుగుతున్నాయి. దీని ద్వారా దయ్యాలు వదలి పోతున్నాయి. రోగాలు నయమవుతున్నాయి. గృహాలు కట్టబడుతున్నాయి. వివాహములు జరుగుతున్నాయి. గర్భములు తెరువబడుతున్నాయి కుటుంబములో సమాధానము, నెమ్మది కలుగుతుంది. రక్షింపబడి బాప్తిస్మములు పొందుతున్నారు. సంఘముమీద పరిశుద్ధాత్మ కుమ్మరింపబడుతుంది. దేవుడు తాను ఏర్పరచుకొనిన భక్తులకు ఒక్కొక్కరికి ఒకొక్క ఆయుధమిస్తాడు. మిర్యాము తంబుర పట్టుకొని లక్షలాది ఇశ్రాయేలీయులను ఆరాధనలో నడిపించింది. మోషే, అహరోనులు కీర్తనలు పాడి దేవుని స్తుతించారు. దావీదు అనేక కీర్తనలు పాడి ఆత్మలో ఆనందిస్తూ నాట్యమాడి దేవుని స్తుతించాడు. దూతలుకూడ పాటలు పాడి దేవుని స్తుతిస్తారని వాక్యంలో ఉంది. యేసుప్రభువుకూడ ఒలీవ కొండలకు వెళ్లినప్పుడు శిష్యులతో కలసి కీర్తనలు పాడాడు. శ్రమలో భక్తులు గొణగరు, సణగరు, దుఃఖించరు కాని శ్రమలో భక్తులు ఆనందిస్తారు. పాటలు పాడి దేవుని స్తుతిస్తారు. పౌలు సీలలను శరీరమంతా గాయపరచినా, దేహమంతా గాయములు, రక్తము కారుతుంది, వస్త్రహీనులుగా చేశారు. జనసమూహమంతా ఎగతాళి చేస్తున్నారు. చెరసాలలో బంధించారు. ఆకలి దప్పులు, వస్త్ర హీనత, ఉపద్రవములు చెరసాల కన్నీరు అన్ని బాధలు అనుభవిస్తున్నా గాని రాత్రంతా పాటలు పాడి దేవుని స్తుతించారు. ఎవరినీ శపించలేదు. గాని బాధించినవారిని క్షమించుమని ప్రార్థించారు. పాటలు పాడి దేవుని మహిమపరచారు. అప్పుడు అద్భుతము వెంబడి అద్భుతము జరిగింది. మహా భూకంపము కలిగి చెరసాల తలుపులు తెరుచుకున్నాయి. బంధకాలు ఊడిపోయాయి. చెరసాల అధిపతి ఆయన కుటుంబము రక్షింపబడింది. ఎంత గొప్ప కార్యము! స్తుతుల మధ్యలో ఆయన నివాసము చేసే దేవుడు ఆయనే కీర్తనీయుడు.

**"యాత్రికుడనైన నేను నా బసలో పాటలు పాడుటకు నీ కట్టడలు హేతువులాయెను."** - కీర్తన. 119:54

విశ్వాసి తన జీవితయాత్రలో క్రీస్తే గురిగా ప్రయాణిస్తున్నాడు. ఈ ప్రయాణములో బాధలు శ్రమలు హింసలు దుఃఖము రోగము ఇరుకులు ఇబ్బందులు వచ్చినా ఈ యాత్రలో పాటలు పాడటానికి దేవుని కట్టడలే హేతువులయ్యాయి అని కీర్తనకారుడు దేవుని స్తుతిస్తున్నాడు. నా శ్రమలో నీ మాటలే నన్ను బ్రదికించాయి. అందుకే నా నోరు విప్పి పాటలు పాడి నిన్ను స్తుతిస్తున్నానని అంటున్నాడు. కీర్తనీయుడు అను నామముతో స్తుతించినప్పుడు దేవునికి క్రొత్త కీర్తనలు పాడి స్తుతించండి. స్తుతిలో ఎంతో శక్తి. నీ సమస్యలు, నీ కట్లు, బంధకములనుండి విడుదల పొందుతావు.

**"సర్వజనులారా, చప్పట్లు కొట్టుడి జయధ్వనులతో దేవునిగూర్చి ఆర్భాటము చేయుడి."** - కీర్తన. 47:1

"దేవుని కీర్తించుడి కీర్తించుడి మన రాజును కీర్తించుడి కీర్తించుడి. దేవుడు సర్వభూమికి రాజైయున్నాడు రమ్యముగా కీర్తనలు పాడుడి."
– కీర్తన. 47:6,7

"యెహోవాను స్తుతించుడి మన దేవునికి స్తోత్ర గానము చేయుట మంచిది అది మనోహరము స్తోత్రముచేయుట ఒప్పిదము." – కీర్తన. 147:1

"యెహోవాను స్తుతించుడి యెహోవాకు క్రొత్త కీర్తన పాడుడి భక్తులు కూడుకొను సమాజములో ఆయనకు స్తోత్రగీతము పాడుడి."– కీర్తన. 149:1

## 247. నా చేతులకు యుద్ధమును నా వ్రేళ్లకు పోరాటమును నేర్పువాడు – కీర్తన. 144:1

"నాకు ఆశ్రయదుర్గమగు యెహోవా సన్నుతింపబడును గాక ఆయన నా చేతులకు యుద్ధమును నా వ్రేళ్లకు పోరాటమును నేర్పువాడై యున్నాడు."
– కీర్తన. 144:1

చేతులకు యుద్ధము వ్రేళ్లకు పోరాటము నేర్పువాడు. అది ఆయన నామము. చేతులకు యుద్ధము, వ్రేళ్లకు పోరాటము నేర్పించేది ఎవరితోనో పోరాడడానికో, ఎవరినో కొట్టడానికో కాదు. చేతులకు యుద్ధము వ్రేళ్ళకు పోరాటము నేర్పుమని ఎందుకు ప్రార్థించాలంటే దేవుడు నీ కప్పగించిన కార్యములు, బాధ్యతలు చక్కని నైపుణ్యముతో సమర్థవంతముగా నెరవేర్చడానికి. నీవు ఉన్నచోట దేవుడు నీకిచ్చిన వెలుగును ఎత్తిపట్టుకోవడానికి, దేవుడు నీకిచ్చిన బుద్ధి బలము, తలాంతులు, సామర్థ్యము చక్కగా వాడబడాలి. దావీదు రాజుగా ఎన్నో కార్యములు చేయాలి. చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. దేవుని స్తుతిస్తున్నాడు – నా ఆశ్రయ దుర్గమగు దేవా, నిన్ను స్తుతిస్తున్నాను. నా చేతులకు నీవు యుద్ధము, వ్రేళ్లకు పోరాటము నేర్పించు అని మొఱ్ఱపెడుతున్నాడు.

నీకు ఏ రంగములోనైనా సరే నైపుణ్యము కావాలంటే ఈ నామమెత్తి ప్రార్థించాలి. కంప్యూటర్ మీద పనిచేయాలన్నా, కారు, మోటర్‌బైక్, విమానం నడిపించాలన్నా దేవుడు నీ చేతులకు శక్తినిస్తాడు. నీవు నమ్మాలి ప్రార్థించాలి పొందాలి. ఆయన చేతులకు యుద్ధము వ్రేళ్లకు పోరాటము నేర్పువాడైయున్నాడు. కొందరు స్త్రీలు మాకు పని రాదని అంటారు. భర్తను ఆకట్టుకోవాలంటే రుచికరముగా వండిపెడితే చాలని పెద్దలంటారు. వంటరాని సహోదరీలు ఈ నామముతో ప్రార్థించండి. దేవునికొరకు బలమైన కార్యములు చేయాలన్నా, సేవలో సహకరించాలన్నా ఒక పెద్ద కూడికను నడిపించాలన్నా ఈ నామము ఎత్తి ప్రార్థించాలి.

1996లో నాకు పాటలు సరిగా పాడటం వచ్చేది కాదు. నన్ను ఒక కూడికకు ఆహ్వానించారు. అక్కడున్న సహోదరి చక్కగా కంజెర కొడుతూ పాడుతుంది. ఆ కూడికలోనే ప్రార్థించాను – ప్రభువా, ఆ సహోదరి ఏదో వాయిస్తుంది. అది వాయించడము నాకు కూడ వస్తే బాగుండునని. ఆయన చేతులకు యుద్ధము వ్రేళ్లకు పోరాటము నేర్పువాడు. అది ఆయన నామము. ఆశించిన దానిని దేవుడు అనుగ్రహించాడు. నా పుట్టినరోజునాడు ఒక సహోదరి కంజెరను బహుమతిగా తెచ్చింది. ఆమె మంచి ప్రార్థనపరురాలు. ఆమెకు నా హృదయములో ఉన్న ఆశ తెలియదు. ఇది దేవుడే ఆమెకు తెలియపరచాడేమో. కంజెరయితే చేతికి వచ్చింది. చూసి మురిసిపోతే సరిపోదు వాయించడము రావాలి అని ప్రార్థించాను. దేవుడు ఎలా వాయించాలో నేర్పించాడు. ఇప్పుడు వాయిస్తుంటే చాలా మంది మీరు ఎక్కడయినా తర్ఫీదు పొందారా? అని అడుగుతారు. దేవునికి స్తోత్రము. ఆయన చేతులకు యుద్ధము వ్రేళ్లకు పోరాటము నేర్పువాడు. నీకు ఏ పనిలో నైపుణ్యము కావాలన్నా ఆయన నేర్పిస్తాడు.

నీవు ఏ కార్యము తలపెట్టినా, ఈ నామముతో ప్రార్థించు. పెళ్లి పని పెట్టుకున్నావా ప్రార్థించు. నాయనా చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. సమయము కొద్దిగా ఉంది. సహాయము చేసేవారు తక్కువ మంది ఉన్నారు. పనులన్నీ సకాలములో జరిగి వివాహము శుభకరముగా మంగళకరముగా జరగాలి. నీవు నా చేతులకు యుద్ధము వ్రేళ్లకు పోరాటము నేర్పుమని అడగాలి.

ఇల్లు కట్టే పని పెట్టుకున్నావా? ఈ నామముతో ప్రార్థించు. కొద్ది సమయంలో గొప్ప పనులు చేయడానికి శక్తి నివ్వమని ప్రార్థించు. దేవుడు తప్పకుండ శక్తినిస్తాడు. లోకరీతి కార్యములు సాధించుకోవడానికే కాకుండ ఆత్మీయకార్యములకొరకు కూడ ఈ నామముతో ప్రార్థించాలి. దేవుని సన్నిధిలో మోకరించి, ఆకాశముతట్టు చేతులెత్తి సాతానును గద్దించే శక్తి పొందాలి. నీ వ్రేలుతో దుష్టత్వమును, చెడుతనమును బంధించాలి. అంటే నీవు దైవికమైన శక్తి పొందాలి. చేతులకు యుద్ధము, వ్రేళ్లకు పోరాటము నేర్పువాడా, నా చేతులకు వ్రేళ్లకు శక్తినిమ్మని ప్రార్థించు.

నెహెమ్యా భక్తుడు పడిపోయిన, పాడైపోయిన యెరూషలేము గోడలు తిరిగి కట్టడానికి పూనుకున్నప్పుడు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నాడు. శత్రువులు పైబడుతున్నారు. అపహాస్యము చేస్తున్నారు. అప్పుడు నెహెమ్యా భక్తుడు – మా చేతులను బలపరచమని ప్రార్థన చేస్తున్నాడు.

"దేవా, ఇప్పుడు నా చేతులను బలపరచుము." – నెహెమ్యా 6:9

"యెహోవా, ప్రతిదినము నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను నీవైపు నా చేతులు చాపుచున్నాను." – కీర్తన. 88:9

దేవుని దగ్గరనుండి అనేకమైన ఆశీర్వాదములను నీ కుటుంబముకొరకు సంఘము నిమిత్తము పొందాలంటే అట్టి నైపుణ్యమును దేవుడు నీ చేతులకిస్తాడు.

ఒక రోజు టి.వి.లో క్రైం రిపోర్ట్‌లో చూశాను. ఒకామెను రెండు చేతులు వెనుకకు కట్టి కిరోసిన్ పోసి తగులబెట్టారు. ఎందుకంటే ఆమె బాణామతి (చేతబడి) ప్రయోగము చేస్తుందని అనుమానము. ఆ చేతులు బాగా కాలిపోయినందున వైద్యులు ఇంకా సెప్టిక్ కాకుండా రెండు చేతులు తొలగించారు. టి.వి.లో చూశాను. ఆమెకు రెండు చేతులు లేవు. ముఖముపై ఈగలు వాలుతుంటే వాటిని పారద్రోలడానికి చేతులు లేవు. మనిషికి చేతులెంత ప్రాముఖ్యమైన అవయవములు. నీకు చేతులు లేకుంటే ఏ పనికూడ చేయలేవు. నీకు రెండు చేతులను ఇచ్చినందుకు ఏనాడైనా దేవుని స్తుతించావా? ఎప్పుడూ చేతులెత్తి దేవుని అడుక్కోవడము కాదు కాని నీ రెండు చేతులెత్తి దేవుని స్తుతించాలి. దేవా, నాకు చక్కని రెండు చేతులిచ్చావు. నీకు స్తోత్రము. ఈ చేతులు పనిచేయడానికి శక్తి నిస్తున్నావు. బలము అనుగ్రహిస్తున్నావు స్తోత్రమని చెప్పాలి. ఈ చేతులతో నీ పనులు చేస్తాను. బలహీనులను బలపరుస్తానని ప్రార్థించాలి. తండ్రీ, నా చేతుల కష్టార్జితమును దీవించు; అనుభవించడానికి కృపను ఇవ్వమని ప్రార్థించాలి.

"నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితము ననుభవించెదవు."
– కీర్తన. 128:2

"ఆమె నడికట్టుచేత నడుము బలపరచుకొని చేతులతో బలముగా పనిచేయును." – సామెతలు 31:17

"ఆమె పంటెను చేత పట్టుకొనును. తన వ్రేళ్లతో కదురు పట్టుకొని వడుకును. దీనులకు తన చెయ్యి చాపును దరిద్రులకు తన చేతులు చాపును."
– సామెతలు 31:19,20

గుణవతియైన భార్య, ఒక చక్కని గృహిణి తన గృహము నిమిత్తము తన చేతులతో బలముగా పనిచేస్తుందని జ్ఞానియైన సొలొమోను వ్రాశాడు.

"తన పనిలో నిపుణతగలవానిని చూచితివా? అల్పులైనవారి యెదుట కాదు వాడు రాజుల యెదుటనే నిలుచును." – సామెతలు 22:29

నీవు ఏ రంగములో పని చేస్తున్నా నీవు చేసే పనిలో నైపుణ్యము సంపాదించి అధికారుల మెప్పు పొందాలంటే చేతులకు యుద్ధము వ్రేళ్ళకు పోరాటము నేర్పువాడా నా చేతులకు నైపుణ్యము, సామర్థ్యము ఇవ్వమని ప్రార్థించు. తప్పకుండ ఆయన నీకు అనుగ్రహిస్తాడు. ❀ – సశేషం

# దేవుని వెయ్యి వాగ్దానములు

గత సంచిక తరువాయి...

## 93. ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు.

– లూకా 6:21

**"అంతట ఆయన తన శిష్యులతట్టు పారచూచి ఇట్లనెను. బీదలైన మీరు ధన్యులు, దేవునిరాజ్యము మీది. ఇప్పుడు ఆకలిగొనుచున్న మీరు ధన్యులు, మీరు తృప్తిపరచబడుదురు. ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు."** – లూకా 6:20,21

యేసు ప్రభువు చెప్పిన మాటలు తప్పకుండా నెరవేర్చబడుతాయి. ఇప్పుడు నీవు ఏడుస్తున్నావు గాని నీవు నవ్వుతావు. నీవు ప్రభువును కలిగి ఉంటే నీ ఏడ్పంతా నవ్వుగా మారిపోతుంది. మనము చాలా సార్లు ఏడ్వాల్సి వస్తుంది. కొన్నిసార్లు మన దోషాల నిమిత్తం, పాపముల నిమిత్తం ఏడుస్తాం. కొన్నిసార్లు మన బలహీనతలను చూసి ఏడుస్తాము. కొన్నిసార్లు మన కొదువల తట్టుచూసి ఏడుస్తాము. కుటుంబములో పరిస్థితులు తారుమారైనప్పుడు, మనం నమ్మినవాళ్లు మనల్ని మోసం చేసినప్పుడు ఏడుస్తాం. కొన్నిసార్లు ప్రభువుకొరకు వీరవాక్యాలు చేసినప్పుడు ఎదురైన వ్యతిరేక శక్తులవలన బాధలు ఎదుర్కొంటూ ప్రభువుతట్టు చూసి ఏడుస్తాము. సేవకులైన మేము ఆత్మల భారంకొరకు కన్నీళ్లు కార్చి ప్రార్థిస్తాం. ఏ ఏడ్పు అయినా ప్రభువులో ఏడ్చామంటే ఆ ఏడ్పంతా నవ్వుగా మారిపోతుంది.

మా సంఘములో 24 గంటల గొలుసు ప్రార్థన ఏర్పాటు చేశాము. నీవు ఏడ్చే ఏ ఏడ్పు అయినా ఆలయంలోకి వచ్చి ఏడువు. ఇంటిదగ్గర, ఇతరుల ముందు ఏడిస్తే ఏమీ లాభము ఉండదు. ఆలయానికి వచ్చి ప్రభువు పాదాలమీద పడి ఏడిస్తే ఒక కాలం వస్తుంది. అప్పుడు మీ ఏడ్పు, అంగలార్పు నాట్యంగా మారిపోతుంది. ఎందుకంటే మనం నిరీక్షణ గలిగిన ప్రజలము. మనము మన ప్రభువైన యేసునందు విశ్వాసం కలిగి ఉన్నాము. నిరీక్షణ అనే పదము పరిశుద్ధ గ్రంథములో అనేకసార్లు ఉంది. **"కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును."**

– 1 కొరింథీ 13:13

అనేకసార్లు విశ్వాసులు సహితం సమస్యలు వచ్చినప్పుడు క్రుంగిపోవడం చూస్తుంటాము. వీరు ఇంతవరకు బాగానే ఉన్నారు. కాని సమస్యలు రాగానే ఇంతవరకు నేర్చుకున్న వాగ్దానాలు, విశ్వాసం, నిరీక్షణ ఎటుపోయాయి అన్పిస్తుంది. అన్నీ ప్రక్కన బెట్టి ఏకధాటిగా కన్నీరు కారుస్తారు. వారు సమస్యకు భయపడుతుంటారు. ఎందుకింత కలవరం? మీ హృదయం కలవరపడనియ్య వద్దు, యెహోవా తమకు దేవుడుగాగల జనులు ధన్యులు. నీవు ఎందుకు భయపడుతున్నావు? నీవు ఇప్పుడు నీ ఒంటరితనమునుబట్టి, అర్థం చేసికునేవారు లేరని ఏడుస్తున్నావేమో! కాని బాధపడువారి నిరీక్షణాస్పదము ఎన్నటికిని నశింపదు. నీ నిరీక్షణ, ఆశ ఆయనమీద ఉంచి ప్రార్థన చేస్తూ ఉండు. సర్వశక్తిగల దేవునితో నీకు కలిగిన బంధమే ప్రార్థన. నీవు ప్రార్థన చేస్తున్నప్పుడు ఆయన నీ కన్నీటిని నాట్యంగా మార్చుతాడు.

**"కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు. పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచుపోవు విత్తువాడు సంతోషగానము చేయుచు పనలు మోసికొనివచ్చును."** – కీర్తన 126:5,6

కన్నీళ్లు, సంతోషము, ఏడ్పు, గానము కలిసి ఉన్న వాక్యము ఇది. అవును ఈ లోకంలో సుఖము, దుఃఖము, కన్నీళ్లు, ఏడ్పు, నవ్వు అన్నీ కలిసే ఉంటాయి. దేవుని వాక్యం విత్తనం వంటిది. అందులో జీవం ఉంటుంది. ప్రయాసం, భారంతో దేవుని బిడ్డగా ఈ లోకంలో ఉన్నావు. దైవజనులు పిడికెడు విత్తనాలు పట్టుకొని యేడ్చుచు విత్తుచుండగా జనులు దేవుడు నాతో ఏమి మాట్లాడుతాడోనని ఆశతో కనిపెట్టుకొని ఉంటారు. విత్తనం ఎలాగు భూమిలో నాటబడి మొలకెత్తి దినదినం వృద్ధిచెంది ఆకులు, కొమ్మలు, కాయలు, ఫలాలు వస్తాయో అలా వాక్యము నీలో నాటబడినప్పుడు నీవు ఫలభరితంగా ఉంటావు. కన్నీళ్లతో విత్తేవాడు సంతోషగానంతో పంటకోస్తాడు. పిడికెడు విత్తనాలు చేతపట్టుకొని ఏడ్చుచుపోవు విత్తువాడు సంతోషగానముతో పనలు మోసికొని వస్తాడు.

దుఃఖం, ప్రయాస, కన్నీళ్లు లోకంలో ఉన్నాయి గాని మన చేతిలో పిడికెడు విత్తనాలు (వాగ్దానములు వినిన వాక్య సత్యములు) ఉన్నాయి. అవి నీ దగ్గరే పెట్టుకోకుండా ఇతరుల్లో విత్తుతూ ఉండాలి. విత్తేవాడు కొద్దిగా విత్తి ఎక్కువగా కోస్తాడు. ఒక బస్తా విత్తనాలు విత్తి దానికి ఎన్నోరెట్లు ఎక్కువగా కోస్తాడు.

నీ దగ్గరున్న దేవుని వాక్యములు విత్తుతూ (ఇతరులకు చెబుతూ) ఉండు. నీవు సంతోషంతో పంట కోస్తావు సంతోషగానము చేయుచు పనలు మోసికొని వస్తావు. క్రైస్తవ జీవితంలోకూడా కన్నీరు, దుఃఖం, ప్రయాసం ఉంటాయి గాని నీ చేతిలో దేవుని వాక్యం అనే విత్తనం ఉంది. కన్నీళ్లతో విత్తితే ఓ రోజు సంతోషం, ఆర్భాటముతో పనలు మోసికొని వస్తావు. నా తల్లి కన్నీళ్లతో విత్తింది. నన్ను చూసినప్పుడల్లా కన్నీరు కార్చి ప్రార్థించింది. విశ్వాసంతో విత్తనాలు విత్తింది. ఈ రోజు సంతోషంతో పంట కోస్తున్నాము.

పిల్లల విషయమై ప్రార్థించేటప్పుడు, నీ ఇంటి పరిస్థితి తారుమారై నప్పుడు దేవునిలో నీ విశ్వాసము చెదరకుండా ఉండాలి. నీతిమంతులు, **యెహోవాయందు నమ్మిక యుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలెనుందురు** (కీర్తన 125:1). దేవుని వాక్యము నీ హృదయంలో ఉండాలి. దేవుడు నీ కన్నీటిని సంతోషముగా మార్చగలడు.

**"సీయోనుకు తిరిగి వచ్చినవారిని యెహోవా చెరలోనుండి రప్పించినప్పుడు మనము కలకనినవారివలె నుంటిమి. మన నోటి నిండ నవ్వుండెను మన నాలుక ఆనందగానముతో నిండియుండెను. అప్పుడు – యెహోవా వీరికొరకు గొప్పకార్యములు చేసెనని అన్యజనులు చెప్పుకొనిరి. యెహోవా మనకొరకు గొప్పకార్యములు చేసియున్నాడు."** – కీర్తన 126:1-3

దేవునియొద్దకు నీవు తిరిగివచ్చినప్పుడు దేవుడు నీ నోటి నిండ నవ్వు, పాటలు అనుగ్రహిస్తాడు. దుఃఖం వచ్చినప్పుడు ఏడుపు, సంతోషం వచ్చినప్పుడు నోటికి పాట వస్తుంది. నీ నాలుక ఆనందగానముతో నిండి ఉన్నప్పుడు అన్యజనులు నిన్ను చూసి ఏ దేవుని నమ్ముకున్నావో గాని నీవు నమ్ముకున్న దేవుడు నిజమైన దేవుడు అని నీ సంతోషమునుగూర్చి సాక్ష్యం ఇస్తారు. నీ అంగలార్పును దేవుడే నాట్యముగా మారుస్తాడు.

మన జీవితాల్లో మనము తప్పక ఈ అనుభవంగుండా వెళ్తాము. రాత్రంతా ఏదో విషయమై ఏడుస్తాము. ఆ ఏడ్పు ఎప్పటికీ అలాగే ఉండదు. ప్రొద్దున లేవగానే నవ్వుతూ కనబడతాం. రాత్రంతా ఏడ్చారు ఇప్పుడు ఇలా నవ్వుతున్నారని చూసేవారికి అనిపిస్తుంది. దేవుని కోపము నిమిషమాత్రమే. ఆయన దయ ఆయుష్కాలమంతా ఉంటుంది. దేవుడు నిన్ను ఎప్పటికీ ఏడ్వనీయడు. సమస్యల్లో కొంతసేపు ఏడుస్తాము. తిరిగి దేవుని వాక్యాన్ని హత్తుకొని ఆయనని ఆశ్రయిస్తే నీ ఏడ్పంతా నవ్వుగా మారిపోతుంది. **"ఆయన కోపము నిమిషమాత్రముండును ఆయన దయ ఆయుష్కాలమంతయు నిలుచును సాయంకాలమున ఏడ్పు వచ్చి, రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును."** – కీర్తన 30:5

## 94. నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము నొందుదురు.

– యెషయా 54:13

ఈ వాగ్దానము నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. నీ పిల్లల్లో కొందరు కాదు, నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము పొందుదురు. నీ పిల్లలకు ట్యూషన్ మాస్టర్ యెహోవాయే. రాత్రింబగళ్లు 24 గంటల ట్యూషన్ ఇది. నీ పిల్లలు కుడి, ఎడమతట్టు తిరిగినప్పుడు వారి చెవులకు ఇది నీకు తగదు ఇదే త్రోవ, దీనిలో నడుచుకో అనే శబ్దం ఎల్లవేళల వినబడుతుంది. పిల్లల గురించి చాలా మందికి బాధ ఉంటుంది. ఎందుకంత బాధ, వ్యసనం, దుఃఖం, కన్నీళ్లు? ప్రార్థన చేసి నీ భారము దేవునిమీద ఉంచి నీవు నెమ్మదిగా ఉండు. నీవు నీ తల్లి గర్భములోనుండి ఈ లోకములోనికి వచ్చినప్పుడు పిల్లలు, పరివారముతో వచ్చావా? ఒంటరిగా వచ్చావు ఒంటరిగానే వెళ్తావు. దేవుడు మధ్యలో నీకు ఇచ్చిన దానములు, ఆశీర్వాదములే పిల్లలు. ఈ ఆశీర్వాదములను కాపాడడానికి దేవుడు నీకొక పనిపెట్టాడు. ఆ పని ప్రార్థనే. ఆ పని చేయకుండా పిల్లలను కొట్టడం, తిట్టడం, వారిమీద అరుస్తూ కేకలు వేస్తుంటే ఇరుగుపొరుగున ఉండే అన్యులు విని వీరి దేవుడు గొప్ప దేవుడు అని చెబుతారు, మరి దినమంతా అరుపులేంటి? వీరికి ఉన్నట్లు మాకు కలవరము లేదు అని అంటారు.

ఒక తల్లి తన పిల్లవాడు మాట వినలేదని కంట్లో కారం పెట్టి కొట్టిందట. ఏమి తల్లిదండ్రులో ఏమో, ఇలాంటివారికి తెలివి ఎప్పుడు వస్తుందో అర్థం కాదు. కంట్లో కారం పెడితే పిల్లవాని కన్ను ఉంటుందా? తెలివిలేదు. పిల్లవాని లోకంలో ఓ గ్రుడ్డివానిగా పడేస్తావా? మరో తల్లి పిల్లవాన్ని బట్టలు విప్పి మరీ కొడుతుందట. అతను 10 సంవత్సరాల చిన్న బాబు. నీ పిల్లలను పెంచుకోవడానికి నీకు జ్ఞానం కావాలి. ప్రభువా! నీవు ఇచ్చిన ఈ సంతానాన్ని చక్కగా పెంచి తిరిగి నీకు అప్పగించడానికి నాకు శక్తి లేదు, నా భక్తికూడా సరిపోదు. నీవే నాకు సహాయం చేయి. నీవు నాటిన నరమొక్కలను నీవే ఎదిగింపజేయుమని ప్రార్థించు. నీకు ఏదీ చేతకాకపోయినా ప్రార్థన చేయడం నీ చేతనౌతుంది. నీవు నీ పిల్లల భవిష్యత్తుకొరకు దేవుని సన్నిధిలో ఏడ్వు. యేసుప్రభువు సిలువ మోస్తూ యెరూషలేము వీధులగుండా వెళ్తూ 'యెరూషలేము కుమార్తెలారా! మీరు నా నిమిత్తము కాదు మీ నిమిత్తం, మీ పిల్లల నిమిత్తం ఏడ్వండి' అని చెప్పాడు. అలా ఏడిస్తే దేవుడు నీ ఏడ్పును సంతోషంగా మారుస్తాడు. నా తల్లిదండ్రులు బ్రతికి ఉంటే నన్ను చూసినప్పుడు వారికి సంతోషం కలిగేది. ఒకప్పుడు నా గురించి ఏడ్చారు. ఆ ఏడ్పు ఎక్కువ కాలం ఉండలేదు. ఆ ఏడ్పులో ప్రార్థన చేశారు. వారు నన్నెప్పుడూ ప్రార్థన చేయి, బైబిల్ చదువు, అది చేయి ఇది చేయి అని బలవంతము చేయలేదు. మేము దేవునియందు నమ్మికయుంచుచున్నాము. తప్పక ఈ బిడ్డ దేవుని సేవలో వాడబడుతుందని విశ్వసించారు. అంతే. దేవుడు నన్ను సేవకురాలిగా నిలబెట్టాడు.

ఈ తరం పిల్లలు చాలా భయంకరమైన రోజుల్లో ఉన్నారు. కావున తల్లిదండ్రులారా! 12 సంవత్సరాలు దాటాక పిల్లల్ని కొట్టే అవసరం లేదు. కొందరు తల్లిదండ్రులు – అరే! నీవు పుట్టిన తర్వాతే మా ఇల్లు ఇలా అయ్యిందిరా! అని తిడుతూ ఉంటారు. అయ్యో! చిన్న గుండెలమీద అనవసరమైన ముద్రలు పడిపోతాయి. ఇల్లు వదిలి వెళ్లిపోతారు. ఇల్లు వదిలి వెళ్లిపోయాక అయ్యో! అంటే లాభం ఉండదు. నీవు చేసిన తప్పుకు నీ బిడ్డలు దారి తప్పిపోతున్నారు. ఇలా ఎందరో చిన్న చిన్న పిల్లలు ఇంట్లోనుండి వెళ్లిపోతున్నారు. నేను ఒకసారి 'జువెనైల్ హోం'కి వెళ్లాను. అక్కడ నేను పోలీసులుచేత పట్టబడిన 100 మంది కన్నా ఎక్కువ పిల్లలను చూశాను. వారితో కొంత సమయము గడిపాను. ఎందుకు ఇల్లువదిలి వచ్చావు? అని ఒక బాబును అడిగితే అమ్మానాన్న తిట్టారు అని జవాబిచ్చాడు. అందరూ చక్కని ఇండ్లలోనుండి వచ్చిన పిల్లలే. దొరబాబుల్లా ఉన్నారు. మూతి, ముక్కు చూస్తే ఎంతో చక్కదనంగా ఉన్నారు! గుంటూరు, విజయవాడ ఎక్కడెక్కడో రోడ్లమీద ఉంటే పోలీస్‌వాళ్లు పట్టుకొచ్చి ఇక్కడ హోంలో పెట్టారు. వారి జీవితాలు అలా కాకుండునట్లు తల్లిదండ్రులు ఎప్పుడూ దేవున్ని జ్ఞానం అడగాలి. దేవుడు ఇచ్చిన బిడ్డలను ఎలా పెంచాలో దేవుని సహాయం పొందాలి. ఓపికతో ప్రేమగా 'బిడ్డా! ఇది నీకు తగదు' అని చెప్పాలి.

నేను నా పిల్లలు చిన్నగా ఉన్నప్పటినుండి ప్రక్కన కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు దేవుని మాటలు మాట్లాడుతుండేదాన్ని. అవన్ని చాలా అవసరం. అయితే నా పెద్ద కుమారుడు యౌవనస్థునిగా ఉన్నప్పుడు ఒక సేవకునిగూర్చి విమర్శించి మాట్లాడాడు. నేను నోర్ముయ్! దేవుని సేవకుని నీవు విమర్శించవద్దు అని అన్నాను. అది అతనికి చాలా లోతుగా నాటుకుపోయింది. అది అయ్యాక నేను వెళ్లి నిద్రపోయాను. రాత్రి 11 గంటలకు నా దగ్గరికి వచ్చి పిలిచి 'సారీ' అన్నాడు. నేను నీవేమి చింతించకు, దేవుడు నిన్ను క్షమిస్తాడని చెప్పాను. ఆ దైవభయం వారిలోకి ఇంజెక్ట్ చేసే బాధ్యత తల్లిదండ్రులది. దేవుని సేవ, దేవుని డబ్బు, దేవుని కార్యాలు ఏంటో నీవే వారికి నేర్పించాలి గాని అస్తమానం తిట్టడం సరికాదు. నీవు దేవునియొద్ద జ్ఞానం పొంది ఆ జ్ఞానం నీ బిడ్డలకు అందించాలి. నీవేమీ గాబరాపడకు. ఇప్పుడు నీ పిల్లలు నీ కంటికి అలా – ఇలా కనబడినా తప్పకుండా ఒక రోజు వస్తుంది. నీ ఆశలన్నీ నెరవేరుతాయి. దేవుడు నీ కోరికను సిద్ధింపజేసి నీ ఆలోచన యావత్తును సఫలం చేస్తాడు. ఇప్పుడు నీ పిల్లల భవిష్యత్తు అస్పష్టంగా అగమ్యగోచరంగా ఉండవచ్చు. ఆలాగు ఉండనీయి. భక్తి అనేది ఇతరులకు ప్రదర్శించుకోవడానికి కాదు. నీవు దేవుని సన్నిధిలో సరిగ్గా ఉండాలి. నీతిమంతుని వేరు తప్పకుండా చిగురిస్తుంది. చిగురించాలి. అంతే.

నేను బ్యాంక్ ఉద్యోగము చేసేటప్పుడు నారాయణగూడ గుండా ప్రయాణించేదాన్ని. అప్పుడు అక్కడ కొందరు రాళ్లు కొట్టేవాళ్లు ఉండేవారు. వాళ్లు రుబ్బురోళ్లు, మసాలాబండలు తయారుచేసేవారు. కొన్ని రోజులు నేను వారిని గమనించాను. మొదట ఆ రాళ్లు ఏ ఆకారం లేకుండ అక్కడక్కడ పడేసి ఉన్నాయి. వాటిమీద వాళ్లు పనిచేస్తున్నారు. వాటికి అప్పటివరకు ఏ ఆకారం రాలేదు. 2, 3 వారాలైన తర్వాత రుబ్బురోళ్లు, మసాలాబండలు చక్కగా అమర్చి, అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకప్పుడు ఏ ఆకారం లేని రాళ్లు, ఏ ఆకారంలోకి వస్తాయో తెలియదు. అక్కడక్కడ పడేసి ఉన్నాయి. అలాగే నీ పిల్లలనుగూర్చి, వారి భవిష్యత్తు ఎలా ఉంటుందో నీకేమీ తెలియదు. కాని అన్నీ తెలిసిన దేవునికి నీవు ప్రార్థన చేస్తూ ఉంటే వారి జీవితాల్లో స్పష్టత వస్తుంది. నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము పొందుతారు.

నీవు చాలా జాగ్రత్తగా ఉండాలి. మన పిల్లలు చాలా ప్రమాదకరమైన దినాల్లో ఉన్నారు. ఒకసారి వార్తాపత్రికలో వచ్చిన వార్త ఇలా ఉంది. ఇద్దరు పిల్లలు సురేష్, రమేష్‌లు మాట్లాడుకుంటున్నారు. వాళ్లు 'దేవుడు' అనే సినిమా చూసివచ్చి ఓ చోట కూర్చొని చర్చిస్తున్నారు. ఒకడు ఆ సినిమాలో ఉన్న ఒక దేవత పేరుతో మరొకని తల్లిని సంబోధించాడట. అతను అది మా అమ్మకాదు మీ అమ్మే అని అన్నాడట. ఆ విషయమై ఇద్దరు గొడవకు దిగి ఒకడు మరొకనిమీద పడి గొంతునులుమగానే వాడు చనిపోయాడట. ఇది నిజంగా జరిగిన సంఘటన. చనిపోయింది 13 సంవత్సరాల బాబు. వారు చాలా ప్రాణమిత్రులు. ఇతను వాడు చనిపోతాడనుకోలేదు. ప్రక్కింటి స్త్రీ

వచ్చి పడిపోయినవాని ముఖంపై నీళ్లు చల్లితే అతను ప్రాణంలేకుండా పడిఉన్నాడు. ఇతన్ని పోలీస్‌వాళ్లు అరెస్టు చేసి తీసికెళ్లారు. కావున మన పిల్లలు కీడులో పడకుండా ఎల్లప్పుడు యెహోవా ఉపదేశం వారికి అవసరము. దేవా! పిల్లలు బయటకు వెళ్తున్నారు. నీవు మాట్లాడే దేవుడవు. మా పిల్లలతో మాట్లాడు. కీడు, పిచ్చి వ్యామోహాలు, ప్రేమ వ్యామోహాలు, వ్యసనాల్లో పడిపోకుండా నీవు ఉపదేశము చేయి, సరియైన త్రోవలు వారికి చూపించు అని ఎల్లవేళల తల్లిదండ్రుల గుండెల్లోనుండి ప్రార్థన ధూపంగా వెళ్లాలి.

తల్లిదండ్రులు వారి పిల్లలకు ఖరీదైన బట్టలు కొనిస్తారు. అప్పులపాలై వేల రూపాయలు ఖర్చుచేసి వారడిగింది కొనిస్తారు. కాని దానివలన ఏమీ లాభము కలుగదు. ఏ తల్లిదండ్రులైనా వారి పిల్లలకొరకు పెట్టే గొప్ప పెట్టుబడి ప్రార్థనయై ఉండాలి. నీ పిల్లలు ఇంటినుండి బయటకు వెళ్లినప్పుడు తల్లిగా, తండ్రిగా వారి తలపై చెయ్యిపెట్టి ప్రార్థన చేసి పంపాలి. ఈనాటి పిల్లలు భయంకరమైన చెడు అలవాట్లకు గురౌతున్నారు. బాల్యం దాటిన పిల్లలు, యౌవనస్థులు డ్రగ్స్ (నల్లమందు) తీసికొని కండ్లు ఎరుపై నోరంతా పొక్కి వికారమైన ముఖాలతో రోడ్లపై తిరుగుతున్నారు. చిన్న వయస్సులోనే దారి తప్పుతున్నారు. మన పిల్లలు దారి తప్పొద్దంటే నిరంతరం యెహోవా ఉపదేశం వారి చెవులకు వినబడాలి. ఎంతకాలం నీ పిల్లలు నీ దగ్గర ఉండి చదువు కుంటారు. చెడుసాంగత్యంలో పడిపోయారంటే నీకు ఉంది చేటు. ఈ రోజు ఎంతో మంది తల్లిదండ్రులు నెమ్మది లేకుండా ఉన్నారు. పిల్లలను ఆశీర్వదించి దీవెనలతో నింపే దేవుని ప్రార్థించి ఈ వాగ్దానము పొందు. నీవేమీ నిరాశ పడొద్దు. కొన్నిసార్లు నీ ప్రార్థన ఫలం నీకు వెంటనే రాకపోవచ్చు. నీ ప్రార్థన ఎక్కువ కావాలని కొంచెం ఆలస్యం కావచ్చు. కాని నీ నిరీక్షణ ఎప్పటికి నశించదు. నీవు ప్రార్థిస్తుంటే నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము పొందుతారు.

## 95. నీ పనుల భారము యెహోవామీద నుంచుము అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును.

– సామెతలు 16:3

ప్రతి ఒక్కరికి పనుల భారం ఉంటుంది. అది దేవునిపై ఉంచితే నీ ఉద్దేశము సఫలమౌతుంది. ఈ రోజు నీ పనుల భారం ఏమిటి? వ్యాపార భారం, కుటుంబ భారం, ఉద్యోగ భారం, భార్య బిడ్డల భారం, ఇంటి సమస్యల భారం అంతా ప్రార్థనద్వారా దేవునికి తెలియజేసినప్పుడు దేవుడు నీ భారము వహిస్తాడు. **"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును."** – మత్తయి 11:28 ప్రార్థన చేసేవారు భారాన్ని మోయరు. భారము మోస్తున్నట్టు లోకానికి కనబడతారంతే.

ఉదాహరణ: ఒక కాడి క్రింద రెండు ఎద్దులు ఉన్నాయి. అందులో ఒకటి బలమైనది, మరొకటి బలహీనమైనది. బలమైన ఎద్దు కాడి బరువంతా మోస్తూ ఉంటుంది. ఇంకో ఎద్దుమీద కాడి ఉన్నట్టు లోకానికి కనబడుతుంది గాని ఆ భారమంతా మోసేది బలమైన ఎద్దు.

అలా ప్రభువు నీ ప్రక్కన ఉండి నీ కాడి భారాన్ని మోస్తున్నాడు. నీవు నీ భారాన్ని ప్రార్థనద్వారా ఆయనమీద మోపాలి. కొందరు ఆ భారమంతా వారిలోనే ఉంచుకొని ఆలోచించి ఆలోచించి నా తల పగిలిపోతుందని అంటారు. కుటుంబ భారం, సంఘ భారం ఆ – ఈ భారాలు భరించలేక పోతున్నామంటారు. నేనైతే అలాంటివి చేయడం ఆపేశాను. ఆలోచిస్తాను గాని దానికి ఓ పరిధి ఉంది. దాని తర్వాత నేను ప్రార్థనకు వెళ్లి ప్రతి ఆలోచన దేవుని సన్నిధిలో పెడతాను.

కావున చిన్నా పెద్ద తేడా లేకుండ అందరూ నన్ను అడుగుతుంటారు. అమ్మా! ఈ సంఘము ఇలాగు వృద్ధి చెందుతూ ఉంది. అమ్మా! మరి మీ సంఘముయొక్క భవిష్యత్తు ఏమిటి? అని. భవిష్యత్తు నా చేతిలో లేదు. సంఘాన్ని కట్టిన దేవుని చేతిలో ఉంది. సంఘమునకు శిరస్సు యేసే. సంఘము దేవునిది. కావున నేనెందుకు అంతగా చింతించాలి? అలాగు నీ కుటుంబమును ఏర్పరచింది దేవుడే కావున నీవు నీ పనుల భారము దేవునిమీద వేయాలి. ప్రార్థన చేయడమే నీవంతు. ప్రతి దానికి అదే మందు. కాని మనుష్యులు అసలు చేయాల్సింది చేయక ఉన్న లోడ్ అంతా నెత్తిన వేసికుంటారు. ఆ భారమంతా వారి నెత్తినే పెట్టుకొని నిద్రరాక నిద్రమాత్రలు మ్రింగుతారు. నీవు అటువంటి తంటాలు పడాల్సిన అవసరం లేదు. ప్రార్థన చేసి నీ భారమంతా దేవునిమీద ఉంచి నీవు చంటిబిడ్డలాగా హాయిగా నిద్రపో. చిన్న బిడ్డ ఉయ్యాల్లో నిద్రించినట్లు నీవు దేవుని నామములు, వాగ్దానములు స్మరిస్తూ నిద్రించు. అంతే నీ పని.

నీ పనుల భారము యెహోవామీద ఉంచు. దేవుడు నీ భారము భరించడానికి సిద్ధముగా ఉన్నాడు. ప్రయాసముతో భారము మోస్తున్న సమస్త జనులారా నా యొద్దకు రండి, మీ భారము నామీద వేయండి అని పిలుస్తున్నాడు. ఇంకను నీవు నీ భారము నీమీదే వేసికుంటావా? విమానంలో వెళ్లాలంటే విమానము టికెట్ కొన్నాక నీ లగేజ్ (సామాన్లు) అంతా ఇచ్చేస్తే వారు నీకొక చిన్న స్లిప్ (కాగితం ముక్క) ఇస్తారు. అది పాకెట్ (జేబు)లో పెట్టుకొని విమానం ఎక్కి హాయిగా సీట్‌లో కూర్చుంటే సరిపోతుంది. అంతేగాక నీవు బెల్ నొక్కగానే ఎయిర్ హోస్టెస్ వస్తుంది. నీకు ఏమికావాలంటే అవి తెస్తుంది. అవి తిని, త్రాగి కూర్చుని దిగేటప్పుడు నీ వస్తువులన్నీ (లగేజ్) చక్కగా బెల్ట్‌మీద వస్తాయి. నీవు అవి తీసికొని వెళ్లాలి. నీవు నీ లగేజ్ ఏమీ మోయాల్సిన అవసరం ఉండదు. అలాగాక రూల్స్ ఏమీ తెలియని వ్యక్తి వచ్చి లగేజ్ అంతా నెత్తిమీద పెట్టుకొని ఎయిర్‌క్రాఫ్ట్‌లో కూర్చున్నాడనుకోండి ఎలా ఉంటుంది? కొందరు క్రైస్తవులు అలాగే ఉంటారు. దేవుడు గొప్పవాడని చెబుతారు గాని హాయిగా ఉండమంటే నెత్తిన సూట్‌కేస్ మీద సూట్‌కేస్ పెట్టుకొంటారు. అలా చేస్తే చూసినవాళ్లు నవ్వుతారు. ఈ లోకంలో నీకు బ్రతకడం తెలియదంటారు. నవ్వులపాలైపోతావు. జాగ్రత్త! దేవుని వాక్యం బాగా నేర్చుకో. నీ భారము యెహోవామీద మోపు. ఎందుకు నీకు ఈ బాధ? దేవుడు పిలువకముందే నీవు ఈ లోకంలోనుండి ఎందుకు వెళ్లిపోతావు? నీ దినముల లెక్క సంపూర్తి కావాలి. నీవు నిండు ఆయుష్షుతో బ్రతకాలి. గుండెపోటుతో మరణించడం దేవుని చిత్తము కాదు. నీకు ఎక్కువ టెన్షన్ అవసరం లేదు. ప్రార్థన చేయి. దానికి మించి నీవు ఏదీ చేయలేవు. ప్రార్థించి నీ భారం ఆయనమీద వేయి. ఆయన తప్పకుండా నీకు సహాయం చేస్తాడు. ప్రార్థించి దేవుని స్తుతించే ప్రతి విశ్వాసి చుట్టూ దేవుని కృప కంచెగా ఉంటుంది. గనుక నీవు భయపడే అవసరం లేదు.

మేము మా సంఘభారము, అవసరతలనుగూర్చి 43 అంశాల ప్రార్థన విన్నపములు సిద్ధపరచి దేవుని సన్నిధిలో 24 గంటలు ప్రార్థిస్తున్నాము. ఎవరైనా వచ్చి సిస్టర్ మీరు మందిరముకొరకు స్థలం చూశారా? అంటే చూడలేదు. స్థలాన్ని చూపించేది, దానికి కావాల్సిన సామాగ్రి ఇచ్చేది దేవుడే అని చెబుతాను. మాకు సేవలో కంప్యూటర్ కావాల్సి ఉంది. ప్రార్థించగానే దేవుడు దాన్ని మాకు అనుగ్రహించాడు. పని ఇచ్చిన దేవుడు ఆ పనికి కావాల్సిన పనిముట్లనుకూడా అనుగ్రహిస్తాడు. గనుక నీవు నీ పనుల భారము ఆయనమీద ఉంచు. ఆయన నీ ఉద్దేశములను సఫలం చేస్తాడు.

❀ - సశేషం

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 101. "మీరు క్రీస్తుతోకూడ లేపబడినవారైతే పైనున్నవాటినే వెదకుడి." - కొలస్సి 3:1

విశ్వాసి పైనున్న వాటిమీదనే లక్ష్యముంచాలి. వాటినే వెదకాలి. మనము అనేక కార్యాలను వెదకుతున్నాము. కాని పైనున్న వాటినే వెదకాలని దేవుని ఆదేశము హెచ్చరిస్తుంది. పైనేముందని పైకే చూస్తూ ఉండాలని కాదు గాని దేవుని నీతిని రాజ్యాన్ని వెదకాలి. దైవకార్యాలను అన్వేషించాలి. ఎందుకంటే **"అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు."** కొలస్సి 3:1 పైనున్న వాటిని వెదకాలంటే దేవునికి ప్రార్థన చేయడం, దేవుని వాక్యమును హత్తుకోవడం, దేవుని కార్యాలు కనుగొనడం, దేవునితో మాట్లాడడం. ఆయనవైపు చూస్తే నీకు ఏ కొదువ ఉండదు. తండ్రి కుడిపార్శ్వమందు యేసుక్రీస్తు నీ కొరకు దివారాత్రులు ఎల్లవేళలా విజ్ఞాపన చేస్తున్నాడు. పైనెందుకు వెదకాలంటే అక్కడ నీకొక ఆశీర్వాదాల ఊట ఉంది. అక్కడ యేసుప్రభువు తండ్రి కుడిపార్శ్వమందు కూర్చొని ఉన్నాడు. కావున నీవు ప్రార్థించినప్పుడు, పైనున్న వాటిని లక్ష్యము చేసినప్పుడు ఆయన నీకు ఫలమిస్తాడు. చాలా మంది పైనున్న వాటిని వెదకరు. వారి చూపు ఎప్పుడూ క్రిందికే ఉంటుంది. ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, ఏమి ధరిస్తామో, ఎప్పుడు ఇల్లు కట్టుకుంటామో, ఎప్పుడు పిల్లల పెళ్లి చేస్తామోనని, ఉద్యోగం చేయాలి, అది - ఇది చేయాలని ఎప్పుడూ అదే విచారం. ఐహిక విచారంచేత నీ హృదయాన్ని కలవరపర్చొద్దని వాక్యములో ఉంది. అలాంటి వారి హృదయం మందమైపోతుంది. అట్టి హృదయాల్లో దేవుని వాక్యము ఫలించదు. కావున మొదట నీ విచారాన్ని కొట్టివేయాలి. దేవుని ఆనందంతో నింపబడి పైనున్న వాటినే వెదకాలి. భూసంబంధమైనవాటిమీద మనస్సు ఉంచొద్దు. కొందరు శ్రమలు వచ్చినప్పుడే దేవుడు కావాలంటారు. ఉదాహరణకు ఒక మేస్త్రీ ఇల్లు నిర్మిస్తూ 3, 4 అంతస్తులమీద పనిచేస్తున్నాడు. అతనికి నీళ్లు కావాలి. మోకాలినొప్పి ఉంది గనుక దిగలేదు. పై నుండి సైగ చేద్దామంటే, పిలవాలంటే ఎవరూపైకి చూడడం లేదు. అక్కడ కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. ఈ మేస్త్రీ ఒక రూపాయి బిల్ల క్రిందకిపడేశాడు. అది దొరికినవాడు వెంటనే వెళ్లి మిఠాయి కొనుక్కొని తిన్నాడు. ఆ మేస్త్రీ మరొక రూపాయి క్రిందకి వేశాడు. వేరొకడు అలాగే కొట్టుకెళ్లి కొనుకున్నాడు. అప్పుడు మేస్త్రీ రూపాయిలు వేస్తే చూడట్లేదు కాబట్టి ఈసారి ఒక రాయి వేశాడట. అది ఒక పిల్లవాని తలకు తగలగానే వెంటనే తలెత్తి పైకి చూశాడట. ఆశీర్వాదాల మీద ఆశీర్వాదాలు వస్తే దేవుని చూడరు. అది మానవ స్వభావము. ఆశీర్వాదాలన్నీ అనుభవించాలంటారు. శ్రమవచ్చినప్పుడే 'ఈ బాధ ఎలా వచ్చింది? దేవుడు నన్ను మొత్తాడా?' అని ఉపవాసం ఉండి ప్రార్థించి దేవుని పట్టుకుంటారు. కావున కీర్తనకారుడు 'నీకట్టడలను నేర్చుకొనుటకు శ్రమనొందియుండుట నాకు మేలైనది' అని అంటున్నాడు. కావున నీవు పైనున్న వాటినే వెదకాలి. అది నీకు సమృద్ధియైన ఆశీర్వాదాలను ఇస్తుంది. నీవు దైవకార్యాలపైనే లక్ష్యముంచాలి.

## 102. "పైనున్నవాటిమీదనేగాని, భూసంబంధమైనవాటిమీద మనస్సు పెట్టుకొనకుడి" - కొలస్సి 3:2-3

పైనున్న వాటిమీదనే మనస్సు పెట్టుకోవాలి. ఎందుకంటే మనము ఈ లోకానికి మృతిపొందియున్నాము. ప్రభువుతో మరణించియున్నాము. ప్రభువుతో కూడ లేపబడినాము. నీటి బాప్తిస్మం తీసుకొనుటయొక్క ఉద్దేశము ఇదియే. అలా చేయుటద్వారా విశ్వాసి యేసుక్రీస్తు మరణ, పునరుత్థానంలో అనుభవము పొందుతున్నాడు. కావున నీ మనస్సు ఈ లోకంమీద ఉంచొద్దు. **"ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతోకూడ దేవునియందు దాచబడియున్నది."** - కొలస్సి 3:2-3. నీవు యేసుమీద లక్ష్యముంచాలి. భూసంబంధమైనవి, ఇహలోక కార్యాలగురించి ఆసక్తి కలిగి, ప్రయత్నాలు చేసి, ప్రయాసపడి, బాధపడి, తంటాలు పడి, తలబాదుకొని, రొమ్ముకొట్టుకొని చాలా మంది అసమాధానము తెచ్చుకుంటారు. సమాధానకర్తయగు దేవుడు మీ హృదయంలో నివసిస్తే మీ చుట్టు ఎన్ని సుడిగుండాలున్నా మీకు శాంతి ఉంటుంది. దేవుని వాక్యము మీలో సమృద్ధిగా నివసింపజేయాలి. వాక్యము ఏమి చెబుతుందో అదే నీలో, నీ ఇంట్లో, నీ పిల్లల్లో, నీ కార్యాల్లో తప్పకుండా చూస్తావు. దేవుని వాక్యము విత్తనము వంటిది. అది నాటబడి ఫలిస్తుంది. మంచి నేలలో పడితే నూరంతల ఫలం వస్తుంది. పరలోకంలోనే కాదు ఈ లోకంలోకూడా దేవుడు తన బిడ్డలకు ఫలం ఇస్తాడు. **"నీతిమంతులు భూమిమీద ప్రతిఫలము పొందుదురు."** - సామెతలు 11:31. దేవుని వెదకేవారికి పరలోకంలో, భూమిమీదను ఫలము ఉంటుంది. భక్తిహీనులు, పాపులు వారు చేసే క్రియలనుబట్టి మరి నిశ్చయముగా భూమిమీద ప్రతిఫలం పొందుతారు. నీవు బాధపడే అవసరం లేదు. ఎల్లప్పుడు దేవునియందు, దైవకార్యాలయందు ఆసక్తి కలిగి ఉండాలి. దేవుని వెదకాలి. దైవకార్యాలు చేయాలి. **"మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి."** - 1 కొరింథీ 15:58. 'నీ ఇంటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షిస్తుంది' అని యేసు ప్రభువు అన్నాడు. పైనున్న వాటిమీద లక్ష్యముంచితే నీకు చాలా సమయం పొదుపవుతుంది. నీవు దేవుని పట్టుకోవాలి.

దేవుని పట్టుకోకముందు నా స్థితి, దేవుని పట్టుకొన్నాక నా స్థితికి జమీన్ - ఆస్మాన్ ఫరక్ ఉంది. దేవుని పట్టుకోకముందు పిల్లల్ని ఎత్తికొని డాక్టర్స్ దగ్గర క్యూలో నిలబడేదాన్ని. ఒకరికి దగ్గు, ఒకరికి జలుబు, అది-ఇది అని ఆఫీస్ నుండి రాగానే పిల్లల్ని తీసికొనిపోయి క్యూలో నిలబడి అక్కడున్న వారందరి అంటువ్యాధులను అంటించుకొని ఇంటికి వచ్చేదాన్ని. ఎంతో బాధ. భయంకరమైన జీవితం. అది నా అనుభవం. ఎప్పుడైతే ప్రభువును నా రక్షకునిగా అంగీకరించానో, పైనున్న వాటిని వెదకడం ఆరంభించానో ఆ అవస్థ నాకు రాలేదు. దేవుని రాజ్యము, నీతి మొదట వెదకితే అవన్నీ నీకు అనుగ్రహిస్తాడు. అందుకే నేను దేవుని సేవ చేయకుంటే భయమేస్తుంది. కష్టాలైనా, తంటాలైనా, ఎలాగైనా దేవుని సేవ చేస్తాను.

ఒక సేవకుడు నా దగ్గరకు వచ్చి చాలా దయనీయమైన సాక్ష్యం చెప్పాడు. అతనొక బ్యాంక్ మేనేజర్. ఇప్పుడతనొక పత్రిక నడిపిస్తున్నాడు. అతని తండ్రి అతన్ని చిన్నతనంలోనే సేవకు ప్రతిష్ఠించాడట. నాకు కొడుకు పుట్టాడు. అతన్ని సేవకు ఇచ్చాననని అనేవాడట. కాని కొడుకు పెరిగి పెద్దవాడైన తర్వాత నీవు మ్రొక్కుకున్నావేమో గాని నాకు సేవచేయడం ఇష్టం లేదు. నేను బ్యాంకింగ్ లోనే వెళ్లిపోతాను. నేను దానికి జవాబుదారున్ని కాదు అని భూసంబంధమైన వాటిని వెదకుతున్నాడట. తండ్రి బాధపడి మరణించి దేవుని సన్నిధికి వెళ్లిపోయాడు కాని భక్తులు ఆశించినది తప్పక జరుగుతుంది. అతని కుమారుడు గొప్ప మేనేజర్ కావాలనుకున్నాడు కాని దేవునికి అవిధేయుడైనందున అతని భార్య మరణించింది. ఆ తర్వాత అతనికి పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పడిపోయాయి. మరియు 16 సంవత్సరాల తన కుమార్తెకు మూత్రపిండాలు పాడై పడకబట్టింది. ఇప్పుడు దేవునికి భయపడుతూ ఉద్యోగమునుండి వాలంటరీ రిటైర్మెంట్ తీసికొని 'కిరణం' అనే పత్రికను నడిపిస్తున్నాడు. 'నా తండ్రి నన్ను సేవకు ఇచ్చినప్పుడు నేను తండ్రిని ధిక్కరించి లోకకార్యాలను ఎక్కువగా ప్రేమించి, లోకశక్తుల్లో కొట్టుకొని పోయాను గనుక దేవుడు నన్ను శిక్షించాడు. కావున నేను నా మనస్సు మార్చుకొని మిగిలియున్న జీవితములో దేవుని సేవిస్తాను' అని చెప్పాడు. ఇప్పుడు అతని పత్రికలు కొన్నివేలుగా ఆంధ్రప్రదేశ్ అంతటా వెళ్తున్నాయి. కావున పైనున్న వాటిమీదే మనస్సు పెట్టుకోవాలి. మనం లోకకార్యాలను వెతకొద్దు. వాదన, కలహం, యుద్ధం మానివేయాలి. దేవుని సన్నిధిలో కన్నీరు కార్చి ప్రార్థించాలి. యుద్ధము యెహోవాది. ఎవరు తరమకుండానే దుష్టుడు పారిపోతాడు.

## 103. "భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపి వేయుడి."

– కొలస్సి 3:5

భూసంబంధమైన స్వభావాలు, శరీర సంబంధమైన కార్యాలు, ధనాశ, అబద్ధాలు, మోసమును చంపేయాలి. ఎప్పుడూ సంపాదించుకోవాలి, కూడగట్టుకోవాలి అనే ఆశ ఉండొద్దు. అది బహు చెడ్డది. ధనవంతులగుటకు తపించవద్దు, ఆపేక్షించవద్దు. దేవునిలోనే మహా ఐశ్వర్యవంతులు కావాలని ఆశించాలి. ఒకని ధనం వాని జీవనానికి మూలము కాదు. ధనము సంపాదించడం నీ ఆత్మకు సంపాద్యం కాదు. కనుక నీ యొక్క మనస్సు ధనంమీద ఉండొద్దు. అది విగ్రహారాధనతో సమానము. కొందరు ఎప్పుడు చూసినా స్కీమ్స్ అని, లాటరీ అని అంటుంటారు. లాటరీలో ఒక్క రూపాయి వేస్తే కోటి రూపాయలు వస్తాయంట. లక్కీలాటరీ అని భ్రమిస్తుంటారు. ఇటువంటివి మనకు వద్దు. మీ కష్టార్జితంతో పైకి రావాలి. 'నీ చేతులు కష్టార్జితాన్ని ఆశీర్వదిస్తాను' అని ప్రభువు చెప్పాడు. కొందరు విశ్వాసులకు ధనం సంపాదించడం ఒక జబ్బు, రోగం. నోరు తెరచి విశ్వాసపు మాటలు, దైవవాక్కులు చెప్పాలి. నోటినుండి పాటలు, ప్రార్థన రావాలి. కాని ఎప్పుడు చూసినా డబ్బు గురించే మాట్లాడుతుంటారు. నేను దేవుని స్తుతిస్తుంటాను. డబ్బు-డబ్బు అని చెప్పి సంఘాన్ని కలుషితము చేయడం నాకు ఇష్టము లేదు. నేను ఇంతవరకు అలాంటి పనులు చేయలేదు. ప్రార్థన శక్తివంతంగా ఉండాలి. డబ్బు నీ కాలి దుమ్ముతో సమానం. దేవుడు తన కార్యాలకొరకు దర్శనం ఇచ్చి డబ్బియ్యకుండా ఉంటాడా? 'సముద్ర వ్యాపారం నీవైపు త్రిప్పుతాను అంధకార స్థలంలో దాచబడిన ధనాన్ని నీకు ఇస్తాను' అని చెప్పాడు. సేవలోనే కాదు కుటుంబాలు నడిపించడానికికూడ డబ్బుమీద కాక దేవుని మీద లక్ష్యముంచాలి. దేవునిమీద లక్ష్యముంచక సంపాదిస్తే, అలా కూడగట్టుకున్నదంతా క్షణంలో మాయమైపోతుంది. దానివలన ప్రయోజనము ఏమిటి? మీ నేత్రాలు ధనంపై ఉంచకండి. దేవునిమీద దృష్టి ఉంచితే డబ్బు దానంతట అదే వస్తుంది. రైలు ఇంజన్ వెంట మిగతా పెట్టెలు వచ్చినట్టు, దేవునితో పాటు డబ్బు వస్తుంది. కాని ఇంజన్‌ను పెట్టెల వెనక పెడితే పెట్టెలు కూడ వెనకకే పోతాయి. కావున నీ జీవితంలో దేవుని ముందే పెట్టు కోవాలి. లోకాశలను చంపుటకు రెండంచులుగల వాక్యమనే ఆత్మఖడ్గము మనకుంది. వాక్యాన్ని ఎక్కువగా ధ్యానించి, నెమరువేస్తు నీ హృదయంలో సమృద్ధిగా నివసింపజేస్తే అప్పుడు నీలో ఈ పాపములేవీ కనబడవు. పాపము చేస్తే వాక్యము చదువలేవు. వాక్యము చదివితే పాపము చేయలేవు. రెండూ మిళితమైతే నీవు మోసకారివి, నీది వేషధారణ అవుతుంది. తొందర్లోనే పడిపోతావు. అలా రెండింటిని ఎలా చేయగలవు? కొందరు చాలా జాగ్రత్తగా పాపము చేస్తారట. కాని దేవుడు అంతరంగములో సత్యమునే కోరుతున్నాడు. పిల్లి కళ్ళు మూసికొని ఎవరూ నన్ను చూడట్లేదని పాలుతాగుతుందట. కాని అందరూ దాన్ని చూస్తుంటారు. నడుము విరిగేటట్లు కొడతారు. అలా ఏ విధంగానైనా నీవు దేవుని కన్నులను కప్పలేవు. ఇవన్నీ తొలగించుకోవాలంటే వాక్యము కావాలి. వాక్యము నీలో ఉన్నప్పుడు పాపము చేయలేవు. చేసినా ఎక్కువ కాలము నిలువలేవు. తప్పక పట్టుబడతావు. కావున నీవు దేవునివైపు తిరగాలి. మీ ఇంట్లో చిన్న చిట్టెలుక కనబడితే ఉండనీయమని, దాన్ని మనతోపాటు బ్రతకనిద్దాం అని అంటారా? అవి ఎప్పటికైనా హానే చేస్తాయని ఎవరూ వాటిని బ్రతుకనీయరు. రేపు చంపుతానని అనరు. వెంటనే చంపేస్తారు. అలాగు దేవుని వాక్యము వెల్లడి అగుటతోడనే నీవు మారుమనస్సు పొందాలి. లేనిచో అది నిన్ను చంపేస్తుంది. పాపమువలన వచ్చు జీతము మరణము.

## 104. "ఇప్పుడైతే మీరు, కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, మీనోట బూతులు అను వీటినన్నిటిని విసర్జించుడి."

– కొలస్సి 3:8

దేవుడు ఎవర్నైనా వాడుకోవాలంటే మొదట వారిని బాగుగా చెక్కుతాడు, ఒకసారి నేను 'ఎందుకు ప్రభువా, నన్నింతగా చెక్కుతున్నావు?' అని అడిగాను. అప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు 'నీవు పెన్సిల్‌తో ఏదైనా వ్రాయాలన్నా, ఏ చిత్రము గీయాలన్నా అలాగే దానిని వాడవు కదా! మొదట దాన్ని చెక్కుతావు. అలాగే నేను వాడుకునే బిడ్డలుకూడా మొద్దుగా కాక పదునుగా ఉండుటకు వారిని చెక్కుతాను' అని బోధించాడు. కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, బూతులు అనువాటిని విసర్జించాలి. కోపము ఉందని కొందరు గర్విస్తారు. అది వారికి క్రెడిట్ అనుకుంటారు గాని అది వారికి డెబిట్. కావున నీవు దాన్ని తొలగించుకోవాలి. కోపగించడము పాపము. ఒకవేళ నీకు ఒక కార్యము గురించి కోపము వచ్చినా సూర్యుడు ఉదయించేవరకు ఉంచుకోవద్దు. ఎందుకంటే దేవుని కోపము నిమిషమాత్రమే, దయ ఆయుష్కాలమంత. ఒకవేళ మంచి కార్యం జరగాలని కోపించినా దాని చేదును మనస్సులో ఉంచుకోవద్దు. కొందరు 'నాకు చాలా కోపమండీ, నా కోపమంతా ముక్కుమీదే' అని అంటారు. అర్థము లేని కార్యాలయందు అతిశయిస్తారు. ఇలా జీవితంలో అర్థములేని పిచ్చి వాటియందు అతిశయించక కేవలము దేవునియందే అతిశయించాలి. **"కోపము మానుము ఆగ్రహము విడిచిపెట్టుము వ్యసనపడకుము అది కీడుకే కారణము."** – కీర్తనలు 37:8. కోపముతో వ్యసనము వస్తుంది. హృదయము నిండిన దానిని బట్టి నోరు పలుకుతుంది. హృదయంలో వ్యసనం, బాధ, భయం, చీకటి, అనుమానం నిండిపోయి ఉంటే నోటినుండి బూతులు వస్తాయి. దేవుని బిడ్డలు వీటన్నింటిని విసర్జించాలి. చెడ్డమాటలు మట్లాడడం గొప్పని, బూతులు స్టైలుగా ఇంగ్లీష్‌లో తిడితే గొప్పనుకుంటారు మరికొందరు. ఏ భాషలో తిట్టినా చెడ్డమాట చెడ్డదే చెడుమాటలు పలకొద్దని వాక్యములో ఉంది. కొందరు కారణం లేకుండానే చెడ్డమాటలు పలుకుతారు. కుక్కను, చెట్టును, వర్షాన్ని, ప్రయాణాల్లో ఇతర ప్రయాణికులను తిడుతూ ఉంటారు. ఇలాంటి వారితో బ్రతకడం చాలా కష్టం. వారికొరకు ప్రార్థించాలి. వాక్యము లేకుంటే అంతా అంధకారమే. వాక్యము నీ కన్నులకు వెలుగునిస్తుంది. ఇంట్లో నీ భార్య లేదా భర్త, బిడ్డలు చెడుమాటలు మాట్లాడినప్పుడు విని ఊరుకోవద్దు. **"దేవుడు ఏ మాత్రమును దుష్కార్యము చేయడు సర్వశక్తుడు న్యాయము తప్పడు."** – యోబు 34:12. చెడ్డమాటలు మాట్లాడేవారి ఆయస్సు సగటులోనే పోతుందని వాక్యము చెబుతుంది. కోపము వలన నీ బి.పి. ఎక్కువ అవుతుంది. హృదయములో వాక్యము నింపుకొని ప్రార్థన చేస్తే ఖచ్చితంగా నార్మల్ అవుతుంది. ఒక లెక్చరర్ హై బి.పి. తో ఉన్నప్పుడు 1000 నామములతో దేవుని స్తుతించిందట. అప్పటినుండి ఇంతవరకు ఆమె బి.పి. నార్మల్‌గా ఉందట. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు. మానవులమైన మనమెలాగు పగతీర్చుకుంటాము? ఎవరైనా నీకు అన్యాయం చేస్తే ప్రార్థించి ఆ వ్యాజ్యాన్ని దేవునికి అప్పగించాలి. దేవుడు చేసినంత చక్కగా నీవు చేయగలవా? ఆయనవి భూమికి పునాదులు వేసిన హస్తాలు. ఆ హస్తాలతో నీ కార్యాలను చక్కగా చేస్తాడు. కావున కోపగించవద్దు. కొందరి ఇళ్ళలో వంటపాత్రలు, బిందెలు వంకర టింకరగా చొట్టలతో ఉంటాయి. నేనొక గృహాన్ని దర్శించినప్పుడు బిందెలన్నీ చక్కగా తోమి వరుసగా అమర్చి పెట్టారు. అవి చాలా తళతళ మెరుస్తున్నాయి గాని బిందెలన్నీ చొట్టలుపడి ఉన్నాయి. 'ఇలా ఎందుకున్నాయి?' అని ఆ సహోదరిని అడిగితే 'ఏం చేయాలమ్మా? మా వారిని కొట్టలేను. పిల్లల్ని కొడదామంటే దొరకరు. కావున నా కోపమంతా బిందెలమీద చూపాను' అని చెప్పింది. దేవుని బిడ్డలు వీటన్నిటిని జయించాలి. వీటిలో అత్యధికమైన విజయం పొందాలి. ఆగ్రహం, కోపం నీ దేహానికి శత్రువులు. దేహము దేవుని ఆలయము, పరిశుద్ధాత్ముడు ఉండే చోటు, దేవుడు నివసింపగోరిన కట్టడము. కోపమువస్తే తలలోని రక్తనాళాలు గడ్డకడుతాయి. కొందరు కోపం వచ్చినప్పుడు తలకొట్టుకుంటారు. గుండె బాదుకుంటారు. నీవు విలువపెట్టి కొనబడిన దేవుని సొత్తు. దేవుడు నిన్ను రక్తమిచ్చికొన్నాడు. దేవుని ధర్మశాస్త్రమును అనుసరించువారికి ఎంతో నెమ్మది కలుగుతుంది. కావున నీవు వీటన్నిటినుండి తొలగిపోవాలి. ❀

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. రోస్, రాంనగర్ గుండు:** మేము యు.పి.ఎఫ్. ద్వారా అనేక మేలులు పొందాము. నేను బి.ఎ., బి.ఈడీ చేశాను. 2015వ సంవత్సరంలో డీఎస్సీ వ్రాస్తే రాలేదు. అమ్మగారు ప్రార్థన చేసి దేవుడు ఆశీర్వదిస్తాడని చెప్పారు. నా భర్తగారి బిజినెస్‌లో నష్టము వచ్చినప్పుడు అమ్మగారు ప్రార్థించారు. **"నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్థిల్లజేయును."** - యోబు 8:6 అనే వాగ్దానము ఇచ్చారు. దేవుడు గొప్పకార్యము చేశాడు. నాకు విద్యానగర్‌లో ఓ స్కూల్‌లో టీచర్‌గా జాబ్ దొరికింది. అంతకుముందు ఏ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నన్ను తీసికోలేదు. కానీ దేవుడు అద్భుతకార్యం చేసినందున నాకు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోనే తెలుగు టీచర్‌గా ఖాళీ ఉన్నందున నాకు లభించింది. నా సర్టిఫికెట్స్ అన్నీ ఇచ్చాను. నాకు స్కూల్‌లో హైయర్ క్లాసెస్ ఇచ్చారు. మరియు సాయంత్రం 3.15 ని.లకు ఇంటికి వెళ్లుటకు పర్మిషన్ ఇచ్చారు. నెల తిరగక ముందే స్కూల్ ప్రిన్సిపాల్ నన్ను పిలిచి హెచ్.ఎం.గా పోస్ట్ ఇచ్చారు. తర్వాత మరిన్ని బాధ్యతలు అప్పగిస్తానని చెప్పారు. దేవుడు చేసిన ఈ గొప్ప కార్యమునుబట్టి దేవుని స్తుతిస్తున్నాను. మా కొరకు ప్రార్థించిన అమ్మగారికి వందనాలు.

**2. సంపూర్ణ, రాంనగర్:** మేము జూన్ నెల 2016 చివరన మా బావగారి రిటైర్మెంట్ ఫంక్షన్‌కు విశాఖపట్నం వెళ్లాము. అక్కడ మా బావగారి తమ్ముడు కోటేశ్వరరావుకు కిడ్నీలు ఫెయిల్ అయినవి. డయాలసిస్ చేసినా అతడు తట్టుకోలేడు చాలా ప్రమాదకరం అన్నారు. అయినా మేము డయాలసిస్ చేయించాము. అతను చాలా సీరియస్ అయ్యాడు. డాక్టర్ హోప్స్ లేవు, ఇంటికి తీసికెళ్లమని చెప్పారు. ఇంటికి తీసుకువచ్చేశారు. రెండు రోజులు సీరియస్‌గా ఉన్నాడు. అమ్మగారు, యు.పి.ఎఫ్. సంఘము ప్రార్థించారు. ఆ ప్రార్థనలద్వారా దేవుడు అతన్ని స్వస్థపరచాడు. అతను బాగుపడి సజీవుల లెక్కలో ఉన్నాడు. తర్వాత డాక్టర్స్‌కు చూపిస్తే వారు పరీక్షలు జరిపి ఒక కిడ్నీ బాగైంది, బాగా పనిచేస్తుందని చెప్పారు. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి సంఘానికి వందనములు.

**3. రాధమ్మ, తార్నాక:** నేను కొంతకాలం నుండి (9.7.16వ తేదీకి) చాలా అస్వస్థత, ఆయాసం, ఊపిరి ఆడక చాలా బాధపడ్డాను. ఎటూ బయటికి వెళ్లలేక ఇంటికే పరిమితం అయ్యాను. సంఘానికి ప్రార్థన విన్నపము తెలిపినప్పుడు అమ్మగారు, సంఘము నాకోసం బహు భారంగా ప్రార్థించారు. దేవుడు నన్ను దర్శించాడు. అద్భుతమైన స్వస్థత, విడుదల పొందాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి సంఘానికి వందనములు.

**4. కాంతామణి, రామకృష్ణాపురం:** నేను 2016 జూలై మొదటివారంలో ఉదయం లేచి బయటకు వచ్చి ప్రక్కనే ఉన్న మెట్లపై పడిపోయాను. బి.పి.ఎక్కువైంది. లేపడానికి ఎవరూ అందుబాటులో లేరు. పిలిచినా వారికి వినబడదు. అందరూ పడుకున్నారు. అప్పుడు నేను దేవునికే మొఱ్ఱపెట్టుకున్నాను. ఆ సమయంలో దేవుడే నాకు సహాయం చేశాడు. నేను లేచి నిలబడ్డాను. తర్వాత మా ఇంటివారు హాస్పిటల్‌కు తీసికెళ్లారు. సంఘానికి ప్రార్థన విన్నపము తెలియజేశారు. సంఘములో నా కొరకు ప్రార్థించారు. దేవుడు నన్ను మరణాపాయంనుండి తప్పించి సజీవుల లెక్కలో ఉంచాడు. కుడిచేయి కొంచెము ప్రక్కకు జరిగింది. (ఫ్రాక్చర్ అయ్యింది) అని దానిని సరిగ్గా అమర్చి ఇంటికి పంపారు. ప్రమాదం తప్పించిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి, సంఘానికి వందనములు.

**5. రెబెక, నారాయణగూడ:** మా అత్తమ్మ నాగమణి కర్నాటకలో ఉంటుంది. ఆమెకి కుడిమోకాలి చిప్ప పూర్తిగా అరిగిపోయి అవస్థ పడుతుంది. డాక్టర్స్‌కు చూపిస్తే లక్షన్నర రూపాయలు ఖర్చు అవుతుంది. అయినా ఆమెకు ఆపరేషన్ సక్సెస్‌కాదు అన్నారు. అప్పుడు మేము **"40 రోజుల సిలువధ్యానాలు - 2016"**లో ఆమెకొరకు భారంగా ప్రార్థించాము. అమ్మగారు, సంఘము ప్రార్థించారు. ఆ ప్రార్థనలద్వారా దేవుడు ఒక అద్భుతకార్యము చేశాడు. బెంగుళూరు గవర్నమెంట్‌నుండి ఆరోగ్యకార్డు ద్వారా లక్షన్నర రూపాయలు మంజూరు అయ్యింది. దేవునిమీద భారం వేసి ఆపరేషన్ చేయించినప్పుడు ఆపరేషన్‌కూడా విజయవంతమైంది. దేవుడు చేసిన ఈ గొప్ప అద్భుత కార్యములకై దేవునికి మహిమ కలుగును గాక. అమ్మగారికి, సంఘానికి వందనములు.

**6. రోసి, బోయిగూడ:** మాకు మొదట పాప. పాప పుట్టిన 5 సంవత్సరాలకు మరో పాప పుట్టి చనిపోయింది. తర్వాత మళ్లీ పిల్లలు పుట్టలేదు. నాకు థైరాయిడ్‌కూడా ఉంది. అమ్మగారి దగ్గరికి వచ్చి ప్రార్థన చేయించుకున్నాను. దేవుడు అద్భుతమైన కార్యం చేశాడు. అదే నెలలో నాకు ప్రెగ్నెన్సీ వచ్చింది. అమ్మగారు నీకు బాబు పుడతాడు, నార్మల్ డెలివరీ అవుతుందని చెప్పి ప్రార్థన చేశారు. యు.పి.ఎఫ్. పాస్టర్, సంఘము ప్రార్థించారు. దేవుడు తన సేవకురాలి మాటను రూఢీపరచాడు. నార్మల్ డెలివరీ అయ్యింది. కుమారుడు జన్మించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**7. సంతోషమ్మ, రాంనగర్:** మా అక్క మనవరాలికి 11 సంవత్సరాలు. పుష్పవతి అయ్యింది. 10.07.2016న ఫంక్షన్ ఏర్పాటు చేశారు. అయితే 9.7.16 న ఆమెకు మూత్రము ఆగిపోయి ఇన్ఫెక్షన్ వచ్చి నీటిబుడగలు వచ్చాయి. నేను వెంటనే చర్చికి ఫోన్‌చేసి ప్రార్థన విన్నపము తెలియజేశాను. సంఘము, యు.పి.ఎఫ్. పాస్టర్ ప్రార్థించారు. కామినేని హాస్పిటల్‌వారు ఈమెను జాయిన్ చేసికోలేదు. నిమ్స్‌లో అడ్మిట్ చేసికున్నారు. సంఘ ప్రార్థనద్వారా దేవుడు ఆ బిడ్డను బ్రతికించాడు. ఆ రాత్రి నేను ఫోన్ చేసి తెలిసికున్నప్పుడు పాప మోషన్ తగ్గాయని, సెలైన్స్ ఎక్కుతున్నాయని చెప్పారు. నేను ఉదయం వచ్చి ఉదయకాల ప్రార్థనలో ప్రార్థించుచున్నందున నా జీవితంలో, అక్క మరియు అన్న కుటుంబాల్లో దేవుడు అద్భుత కార్యములు చేస్తున్నాడు. నా మనవరాలు స్వాతి కుమారుడు (13 నెలలు) రక్తము, మూత్రము ఇన్ఫెక్షన్‌తో బాధపడినప్పుడు అమ్మగారు, సంఘము ప్రార్థించారు. దేవుడు అద్భుతంగా స్వస్థత నిచ్చాడు. అమ్మగారి ప్రార్థన ద్వారా దేవుడు నన్ను ఆరోగ్యంతో నడిపిస్తున్నాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**8. శివమ్మ, చిక్కడపల్లి:** నేను 2016 జూలై నెల మొదటి వారంలో నీరసం, బలహీనతతో చాలా క్రుంగిపోయి వచ్చాను. నాకు ఓవర్ బ్లీడింగ్ అవుతుంది. వారం రోజులు ఎంతో కష్టపడ్డాను. నాకు రక్తంకూడా చాలా తక్కువగా ఉంది. అయితే నేను అమ్మగారి దగ్గరకు వచ్చి ప్రార్థించుకున్న

తర్వాత స్వస్థత కలిగింది. బ్లీడింగ్ ఆగిపోయింది. నాయెడల దేవుడు చూపిన కృపనుబట్టి దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**9. శ్రీలేఖ, రాంనగర్:** నేను 2015 డిసెంబర్ 25వ తేదీన తమిళనాడు వెళ్లినప్పుడు 'దేవుని నామములు' పుస్తకములు కొన్ని తెలుగు కొన్ని ఇంగ్లీష్ తీసికెళ్లి అక్కడ పంచాను. మేము రాంనగర్‌లోనే అద్దె ఇంట్లో ఉంటాము. అయితే ఓనర్ మమ్మల్ని ఏప్రిల్ 2016లో ఖాళీ చేయాలని చెప్పారు. మేము రాంనగర్‌లోనే సొంత ఇల్లు దొరకాలని ప్రార్థన చేశాము. మేము వెదుకుతున్నప్పుడు 15 సంవత్సరాల అపార్ట్‌మెంట్స్, లిఫ్ట్ అండ్ కార్ పార్కింగ్ సౌలభ్యం లేనివి కనబడ్డాయి. మా ఇంటి ఓనర్స్ తొందర పెడుతున్నారు. తర్వాత ఫిబ్రవరిలోనే ఇల్లు ఖాళీ చేసి ఇవ్వమన్నారు. నేను, నా భర్త ఇద్దరం ఉద్యోగస్థులమే, కనుక లీవ్‌పెట్టి వెతికాము. ప్రార్థించుకొని దేవుని నామములు పుస్తకములు పంచుటవలన 'డబుల్ బెడ్‌రూం విత్ సిట్టింగ్ రూం' 2వ అంతస్థులో మంచి ఫ్లాట్ దొరికింది. లిఫ్ట్, కార్ పార్కింగ్‌కూడా ఉంది. 16 లక్షల రూపాయలకే రాంనగర్‌లోనే మంచి ఇంటినిచ్చిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**10. లీల:** అమ్మగారు, సంఘ ప్రార్థనలవలన 2015వ సంవత్సరంలో నాకు మంచి వివాహ సంబంధం వచ్చి వివాహం ఘనంగా జరిగింది. నాకు మంచి కుటుంబం లభించింది. వివాహమైన రెండు నెలలకు నేను నా భర్తతో కలసి వచ్చి అమ్మగారి దగ్గర ప్రార్థన చేయించుకున్నాము. అమ్మగారు నా పొట్టపై చెయ్యిపెట్టి గర్భఫలం కోసం ప్రార్థించారు. దేవుడు వెంటనే నా గర్భము తెరచాడు. డెలివరీ సమయంలో బి.పి. చాలా ఎక్కువైతే హాస్పిటల్‌లో అడ్మిట్ అవ్వమన్నారు. అమ్మగారు ఏమీకాదు, నార్మల్ డెలివరీ అవుతుందని చెప్పి ప్రార్థన చేశారు. ప్రార్థించాక నొప్పులు వచ్చినవి. ప్రార్థన వీరులుకూడా ప్రార్థించారు. దేవుని కృప, అమ్మగారు, సంఘ ప్రార్థనలవలన నార్మల్ డెలివరీ అయ్యింది. ఆరోగ్యకరమైన అందమైన కుమారుడు జన్మించాడు. అమ్మగారు 10.7.16న మా బాబుకు విజయ్ మ్యాథ్యూ అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**11. జ్యోతి, రాంనగర్:** మాకు మొదట ఒక పాప పేరు జెస్సికా. తర్వాత చాలా గ్యాప్ తర్వాత అమ్మగారి దగ్గర ప్రార్థనకు నిలబడ్డప్పుడు నీకు ఇంకో బిడ్డ వద్దా? అని తానే పిల్లలకొరకు ప్రార్థించారు. నీకు మంచి కుమారుడు పుడతాడని చెప్పారు. దేవుడు తన సేవకురాలి మాటను రూఢీ పరచి గర్భము తెరచి మంచి ఆరోగ్యకరమైన కుమారుని అనుగ్రహించాడు. 10.7.2016న అమ్మగారు మా బాబుకు విజయపాల్ అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**12. సృజన్‌కుమార్:** మేము 10 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్.కు వస్తున్నాము. 2.7.16న దేవుడు నా భార్యను మరణాపాయంనుండి తప్పించాడు. 5వ అంతస్థులో లిఫ్ట్‌లో ఉన్నప్పుడు అకస్మాత్తుగా మెకానిక్ ప్రాబ్లమ్ వల్ల క్రిందికి వచ్చింది. దేవుని కృపవలన దానంతట అది 2 మరియు 3 అంతస్థుల మధ్య ఆగిపోయింది. ఏ అపాయం కలుగకుండ కాపాడిన దేవునికి స్తోత్రములు. 2016వ సంవత్సరంలో దేవుడు మా కుటుంబములో గొప్ప అద్భుతకార్యం జరిగించాడు. నేను 40 రోజుల సిలువ ధ్యానాలు – 2016కు క్రమంగా వచ్చాను. మా చిన్న కుమారునికి గవర్నమెంట్ జాబ్ వచ్చింది. అతను మెకానిక్ ఇంజనీరు. పవర్‌ప్లాంట్ ఇంజనీర్‌గా నార్త్ ఇండియాలో కొంతకాలం పనిచేశాడు. విదేశాలకు వెళ్లి జాబ్ చేశాడు. కాని అతనికి సరియైన సంఘం, సహవాసం లేదు. అయితే 2016వ సంవత్సరంలో మా చిన్న కుమారుడు జాన్ 'తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్' పోస్ట్‌కి ఎగ్జామ్ వ్రాశాడు. ఫస్ట్ లిస్ట్‌లో అతనిపేరు రాలేదు. కానీ సెకండ్ లిస్ట్‌లో సెలెక్ట్ అయ్యాడు. సివిల్ పోస్టులో ఎవరూ రాకపోతే మెకానికల్ ఇంజనీర్‌గా మా కుమారున్ని తీసికున్నారు. ఆ రీతిగా దేవుడు మా చిన్న కుమారునికి జి.హెచ్.ఎం.సి. కార్యాలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా గవర్నమెంట్ ఉద్యోగాన్ని అనుగ్రహించాడు. మేము అమ్మగారి ప్రార్థన ద్వారా ఎంతగానో దీవింపబడ్డాము. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**13. ప్రేమకుమారి:** నేను రిటైర్డ్ నర్స్‌ని (ఉస్మానియా). నేనెప్పుడూ కొన్ని ప్రార్థన విన్నపములతో సంఘానికి వచ్చి ప్రార్థన కోరేదాన్ని. ప్రేయర్ రిక్వెస్ట్ రిజిస్టర్‌లో వ్రాసేదాన్ని. మా రెండో అక్క కుమార్తెకు వివాహము కాలేదు. ఆమె వయస్సు 35 సంవత్సరాలు. ఎం.ఎస్సీ చేసింది. ఆమె గురించి ఇక్కడ ప్రార్థించినప్పుడు మంచి సంబంధం దొరికింది. అబ్బాయి చాలా ఆత్మీయంగా ఉంటాడు. 2 సంవత్సరాలుగా గర్భఫలం కూడా లేదు. ఇక్కడ ప్రార్థించినప్పుడు దేవుడు ఆమె గర్భము తెరచాడు. ఇప్పుడు ఆమె 7వ నెల గర్భిణీ. నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. నా కుమార్తె శృతి ఎం.ఎస్సీ. బయోటెక్నాలజీ చేసింది. ఆమె ఉద్యోగం, వివాహంకొరకు సంఘంలో ప్రార్థన విన్నపము ఇచ్చాను. అమ్మగారు ప్రార్థించారు. అయితే నా బిడ్డ ప్రైవేటు జాబ్ చేస్తుంది. చిన్న ఉద్యోగం, వివాహం కాలేదు. ఆమెకు 29 సంవత్సరాలు వచ్చాయి అని ప్రార్థిస్తే దేవుడు గొప్పకార్యం చేశాడు. ఉద్యోగం ఇచ్చాడు. అమ్మగారు ప్రార్థించి మంచి వరుడు దొరుకుతాడని చెప్పారు. అమ్మగారు ప్రార్థించిన 3 నెలలకే మంచి వరుడు దొరికాడు. మార్చి 2016లో ఎంగేజ్‌మెంట్ అయ్యింది. ఏప్రిల్, 2016లో వివాహం జరిగింది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**14. ఉదయశ్రీ, జె.ఎన్.టి.యు.:** నేను 3 సంవత్సరాలనుండి యు.పి.ఎఫ్.కు వస్తున్నాను. 3 సంవత్సరాలనుండి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. కానీ ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఎన్నో కోచింగ్స్ తీసికున్నాను. ఎన్నో క్లాసెస్‌కు హాజరయ్యాను. ఫలితం ఏం దొరకలేదు. ఇక నా క్వాలిఫికేషన్, సర్టిఫికెట్స్ అన్నీ వేస్ట్ అనుకున్నాను. ప్రతీ ఒక్కరి మాట విని అటూ ఇటూ తిరిగాను. కానీ ఏ అవకాశం రాలేదు. ఇక నా స్థితి ఇంతే ఈ ఉద్యోగంతోనే సరిపెట్టుకోవాలి. ఇక నా ఆర్థిక పరిస్థితులు ఇంతే అనుకున్నాను. అయితే ఒక రోజు కుటుంబంతో కలసి అమ్మగారి దగ్గరకు వచ్చాను. అమ్మగారు ప్రార్థన చేసి ఆదివారం సాయంకాలం ఆరాధనకు ఉస్మానియా గార్డెన్‌కు రండి, ఖచ్చితంగా మంచి ఉద్యోగం లభిస్తుంది అని చెప్పారు. నేను ఆ మాటకు విధేయత చూపాను. 2 నెలల కోర్సుకు వెళ్లడం, మా బావగారి దగ్గర నేర్చుకోవడం చేశాను. దేవుడు కృపచూపాడు. మంచి ఎం.ఎన్.సి.లో జాబ్ వచ్చింది. దేవునికి స్తోత్రములు. మా కోసం భారంగా ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**15. ఫ్లారెన్స్, రామంతపూర్:** నేను అనారోగ్యతతో ఉన్నప్పుడు అమ్మగారు వ్రాసిన దైవిక స్వస్థత పుస్తకము చదివాను. ఉపవాసముండి సంఘంతో ఏకీభవించి ప్రార్థించుకున్నప్పుడు దేవుడు నాకు సంపూర్ణ స్వస్థతనిచ్చాడు. ప్రార్థనలవలనే మా నాన్న త్రాగుడునుండి విడిపింప బడ్డాడు. మా అమ్మ అనారోగ్యంనుండి విడుదల పొందింది. దేవునికి స్తోత్రములు, అమ్మగారికి వందనములు.

**16. శోభ, రాంనగర్:** మా చెల్లెలు సంతోషికి తరచూ కుడివైపు భాగంలో కడుపునొప్పి వచ్చి బాధపడుతుండేది. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమెను ఆసుపత్రిలో చూపిస్తే డాక్టర్స్ లివర్‌లో రాళ్లు ఉన్నాయని చెప్పారు. ఆపరేషన్ చేయాలన్నారు. ఆమె మా అమ్మవాళ్ల ఇంటికి వచ్చి వారం రోజులు ఉండి

ఎంతో ఏడ్చింది. ఆమె చిన్న కుమారుడు నెలల పిల్లాడు. ఆపరేషన్ అయితే ఆమెను, బాబును ఎవరు చూసుకుంటారని వాపోయింది. అమ్మగారికి చెప్పినప్పుడు అమ్మగారు ప్రార్థించారు. ప్రార్థన గోపురంలోకూడా ప్రార్థనలు జరిగాయి. అద్భుతకరుడైన దేవుడు గొప్ప అద్భుతకార్యము చేశాడు. మళ్లీ కడుపునొప్పి వచ్చి ఆస్పత్రికి వెళ్లినప్పుడు డాక్టర్స్ స్కానింగ్ చేశారు. ఆ రిపోర్టు వచ్చినప్పుడు లివర్‌లో రాళ్లు లేవు అని చెప్పారు. నార్మల్ రిపోర్టు ఇచ్చిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**17. సుమలత, నిజామాబాద్ :** నేను ఎక్స్ఛేంజి డిపార్టుమెంటు పరీక్ష వ్రాసేముందు అమ్మగారి దగ్గరికి వచ్చి ప్రార్థన చేయించుకున్నాను. దేవుని కృప అమ్మగారి ప్రార్థనవల్ల పరీక్ష వ్రాసి అర్హత పొందాను. సంవత్సరం తర్వాత పోస్టింగు ఇచ్చారు. దేవుడు నా హృదయవాంఛను తీర్చి ఎక్స్ఛేంజి డిపార్టుమెంటులో ఉద్యోగం అనుగ్రహించాడు. నేను కోరుకున్నది దేవుడు నాకనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి వందనములు.

**18. జయస్టాన్లీ, రామ్‌నగర్ :** నాకు నీరసంగా ఉండడం వల్ల పరీక్ష చేయిస్తే రక్తం తక్కువగా ఉందని చెప్పారు. మూడు నెలలుగా రక్తం తక్కువగా ఉండడం వల్ల అనేకసార్లు పడిపోతూ ఎంతో బాధపడ్డాను. అమ్మగారు మరియు ప్రార్థన వీరులు ప్రార్థించినప్పుడు నాకు స్వస్థత లభించింది. నా భర్త ఆరోగ్యం, ఉద్యోగం మరియు ప్రతి విషయంలో దేవుడు ఎన్నో గొప్పకార్యాలు చేశాడు. దేవునికి స్తోత్రములు! ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**19. రేఖ :** నేను యు.పి.ఎఫ్. సంఘములో సండే స్కూలు మరియు వి.బి.ఎస్. టీచర్‌గా సహకరిస్తాను. మొదటి వి.బి.ఎస్.లో సహకరించిన తర్వాత దేవుడు నాకు యస్.బి.ఐ.లో ప్రొబెషనరీ ఆఫీసర్ ఉద్యోగము అనుగ్రహించాడు. మా చీఫ్ మేనేజర్ ఒక మహిళ. ఆమె నన్ను చాలా బాధపెట్టింది. ఆమె పెట్టే హింసలకి, వత్తిడికి నేనెంతో క్రుంగిపోయి ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని.

నేను అమ్మగారికి ఈ విషయమంతా చెప్పినప్పుడు అమ్మగారు ప్రార్థన చేసి **"ముష్కరులైన యజమానులకుకూడా లోబడి ఉండుడి"** అనే వాక్యము వ్రాయమన్నారు. నేను వ్రాశాను. 3.5.2014న ఆమె ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోయింది. ఆ ఆరునెలల్లో నాన్ పెర్‌ఫార్మర్ నిన్ను ఉద్యోగంలోనుండి తీసేస్తానని అనింది. నేనేమీ పనిచేయననే పుకారు ప్రచారం చేసింది. నేను ఆరు నెలల్లో పన్నెండు కోట్ల రూపాయల బిజినెస్ చేశాను. ఆమె తర్వాత ఒకతను, అతని తర్వాత మరొకతను వచ్చారు గాని అదే బ్రాంచ్‌లో నన్నుంచాలని, తీసెయ్యొద్దని అన్నారు. ప్రొఫైల్ లేకున్నా అదేవని ఎందుకు చెయ్యమంటున్నారని బాధపడ్డాను. కాని 11.7.2015న, నన్ను వద్దన్నవారే నీవు చక్కగా పెర్‌ఫాం చేశావని అన్నారు. జనరల్ మేనేజర్ దగ్గరనుండి నాకు మంచి సత్కారం లభించింది. నేను ఎక్కడ తృణీకరింపబడ్డానో అక్కడే దేవుడు నన్ను ఘనపరచాడు. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి వందనములు.

**20. ఎస్తేర్ రాణి, పంజాగుట్ట:** నాకు 15 సంవత్సరములనుండి చర్మవ్యాధి (సొరియాసిస్) ఉంది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. బయటకు వెళ్లినప్పుడు సూర్యకాంతివలన ఆ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. నేను మార్చి, 2016లో యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చి అమ్మగారితో ప్రార్థన చేయించుకున్నాను. దేవుడు తన దాసురాలి ప్రార్థన ఆలకించి 15 సంవత్సరాలుగా ఉన్న సమస్య (సొరియాసిస్) నుండి సంపూర్ణ స్వస్థత దయచేశాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**21. శ్రీమతి రమణ, సరూర్‌నగర్:** నా కుమార్తె దివ్య దీపిక. అల్లుడు రత్నప్రకాశ్ నాకు యు.పి.ఎఫ్. సంఘమన్నా, అమ్మగారన్నా చాలా ఇష్టం. ఆమె నా తల్లిని మించిన తల్లి. ఏ క్షణమైనా దేనిగురించి అయినా బాధపడుతుంటే నన్ను హెచ్చరించి ధైర్యం చెప్పే వాక్యం వల్ల శక్తిపొందుతూ ఇంతవరకు బ్రతికి ఉన్నాను. దేవుడు 2015వ సంవత్సరంలో నా కుమార్తె దివ్యదీపిక గర్భము తెరిచాడు. కాని పిండము నెలరోజులుగా ఉన్నప్పటి నుండి కూడా డాక్టర్స్ బేబీ సరిగ్గా నిర్మాణము కావడం లేదంటూ చెబుతూ వస్తున్నారు. ఆమెకు షుగర్, థైరాయిడ్ సమస్య తీవ్రంగా ఉంది. గనుక ప్రతినెల కూడా బేబీ ఎదగడం లేదని డాక్టర్స్ చెబుతున్నారు. అలాగే ఉంటే పుట్టే బిడ్డ సరిగ్గా ఉండదని అంటున్నా మేము దేవునియందు విశ్వాసముంచి గర్భము అలాగే ఉండనిమ్మన్నాము. అద్భుతాలు చేయుదేవుడు మంచి బాబునిస్తాడని విశ్వసించాం. పుట్టే బిడ్డ మేము ఆశించినట్టు కాక ఎలా ఉన్నా దేవునికి దగ్గరగా పెంచుతామని దేవుని యొద్ద ఒప్పుకున్నాము. అమ్మగారి మాటలద్వారా ధైర్యం పొందాము. దేవుడు నవమాసాలు కాపాడి 3.5.16న ఆరోగ్యకరమైన అందమైన శిశువును 2.7 కిలోల బరువుతో అనుగ్రహించాడు. 17.7.2016న అమ్మగారు బాబుకు షాన్ మైఖెల్ అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**22. లలిత:** నేను చాలా కాలంనుండి మోకాళ్లనొప్పులతో శరీర అస్వస్థతతో బాధపడుతున్నాను. అమ్మగారు ప్రార్థించాక నాకు స్వస్థత కలిగింది. అప్పటినుండి క్రమంగా చర్చికి (యు.పి.ఎఫ్.కి) వస్తున్నాను. నాకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారునికి వివాహమైంది. కాని కోడలు మాపై కోర్టులో కేసు పెట్టింది. అమ్మగారు, సంఘమునకు ప్రార్థన విన్నపము తెలియజేసినప్పుడు వారు భారంగా ప్రార్థించారు. దేవుడు అద్భుతముగా కోర్టుకేసులో మాకు విజయము ఇచ్చి నెమ్మది అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

## యూత్ రిట్రీట్

**ప్రతి నెల మూడవ శనివారం ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు యు.పి.ఎఫ్. రాంనగర్ ఆలయంలో జరుగును.**

**"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును." - యోహాను 14:14**

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF) నిర్వహించు**

# సంపూర్ణ రాత్రి ప్రార్థన

**అందరికీ ఆహ్వానము**

**తేది : 31 ఆగష్టు 2016 (బుధవారం)**
**సమయము : రా॥ 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**స్థలము : సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.**

## యు.పి.ఎఫ్. ఇతర సేవా కార్యక్రమాలు

- ప్రతి ఆదివారము **"ప్రభాత ఆరాధన"** ఉదయము 6.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు.
  స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో
- ప్రతి ఆదివారము **"ఇంగ్లీషు ఆరాధన"** సాయంత్రం 4.00గం॥ల నుండి 6 గం॥ల వరకు మరియు **"తెలుగు ఆరాధన"** సాయంత్రం 6.00గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
  స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్ - 500 044.
- ప్రతి ఆదివారము **"సండే స్కూల్"** ఉ॥ 7.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు. (స్థలము : యు.పి.ఎఫ్. విలాసములో)
- ప్రతి రోజు **"ఉదయకాల ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి 7 గం॥ల వరకు
- ప్రతి సోమవారము **"మెన్స్ ప్రేయర్ ఫెలోషిప్"** సాయంత్రం 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు.
- ప్రతి సోమవారము **"తల్లి - కుమార్తెల సహవాసము"** సా॥ 6 గం.ల నుండి రా॥ 8.30 ని.ల వరకు.
- ప్రతి మంగళవారము **"దేవుని వెయ్యి నామములు"** ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1.00 గంట వరకు.
- ప్రతి మంగళ, బుధవారములలో **"బైబిల్ కాలేజి తరగతులు"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 9.00 గం॥ల వరకు.
- ప్రతి గురువారము "ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము" సాయంత్రం 6.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల వరకు.
- ప్రతి శుక్రవారము **"ఉపవాస ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ వరకు మరియు ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1 గం॥ వరకు మరియు సా॥ 5.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు. **రోగుల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**
- ప్రతి శనివారము **"వృద్ధుల సహవాసము"** మ॥ 2.00 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు. **"యౌవన పురుషుల సహవాసము"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
- ప్రతి నెల మొదటి శనివారము **"సేవకురాండ్ర సదస్సు"** ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ల వరకు.**యు.పి.ఎఫ్. రాంనగర్‌లో**
- ప్రతి నెల రెండవ శనివారము **"ప్రత్యేక ఉపవాస ప్రార్థన"** ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
  స్థలము:యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో.
- ప్రతి నెల ఆఖరి బుధవారము **"సంపూర్ణ రాత్రి పార్థన"** రాత్రి 9.00 గం॥ల నుండి ఉ॥ 5.00 గం॥ల వరకు
  **స్థలము: సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్.**
- అవసరతల చొప్పున గృహ కూడికలు, గృహ సందర్శనములు, రోగులకొరకు ప్రార్థనలు జరుపబడును.

## పుస్తకములు & సి.డి. పరిచర్య

జాయ్ చెరియన్ గారు ప్రసంగించిన ప్రసంగములు సి.డి. రూపములో మీకు అందుబాటులో ఉన్నవి. **యు.పి.ఎఫ్.** ఆఫీసులో మీకు లభ్యమగును.

పోస్టుద్వారా పుస్తకములు కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

| | |
|---|---|
| **దేవుని వెయ్యి ఆదేశములు (1-300) (సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **మీ హృదయము కలవరపడనియ్యకుడి (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నా ప్రాణ ప్రియుడు (వి.సి.డి. & సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నూతన సంవత్సర తీర్మాణములు (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **క్రిస్మస్ వేడుకలు (డి.వి.డి.)** | **వెల రూ. 30/-** |
| **కాపరి లక్షణములు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **తల్లులకు హెచ్చరికలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసి యాత్ర కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుడు కోరునది (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ఆశీర్వాదమునకు రహస్యము విధేయత (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **దేవునికి ఇచ్చుటలో దీవెన (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **దేవుని వెయ్యి నామములు (MP3)** | **వెల రూ. 40/-** |
| **నిన్ను విడువను నిన్ను ఎడబాయను (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నూతన సంవత్సరము - దిద్దుబాటు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **జ్ఞానవంతురాలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **శుభకరమైన ఆనవాలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసురాలైన తల్లి (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సిలువ ధ్యాన కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుని యొద్దనుండి ఒక మాట (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నన్నాశ్రయించుడి, నన్నాశ్రయించినయెడల మీరు బ్రతుకుదురు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సంఘ పరిచర్యలో స్త్రీలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **మీరు లోకమునకు వెలుగైయున్నారు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రొత్త మనస్సు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రైస్తవ కుటుంబము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **బలిపీఠంమీద నిత్యం అగ్ని మండుచుండవలెను... (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **స్త్రీలు - పరిశుద్ధత, పరిశుభ్రత (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ప్రభువా! నాకు సహాయము చేయుము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ఆయన సమస్తమును మనకు అనుగ్రహించును (సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **స్త్రీలు మౌనముగా ఉండవలెనా? 1 & 2 (వి.సి.డి.)** | **వెల రూ. 50/-** |
| **ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను. (డి.వి.డి.)** | **వెల రూ. 50/-** |
| **హృదయపరీక్ష (MP3)** | **వెల రూ. 60/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని నామములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని వాగ్దానములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

| | |
|---|---|
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - II**<br>101-200 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - III**<br>201-300 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - IV**<br>301-400 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - V**<br>401-500 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VI**<br>501-600 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VII**<br>601-700 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VIII**<br>701-800 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 150/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - I** | **వెల రూ. 100/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - II** | **వెల రూ. 100/-** |
| **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) | **వెల రూ. 120/-** |
| **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) | **వెల రూ.10/-** |
| **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లీషు, తెలుగు&హింది) | **వెల రూ. 10/-** |
| **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |

RNI. No. APTEL 2007/24270



**మీకు మీ సెల్‌లో ప్రతి రోజు దేవుని వాక్యము కావలెనా?**

ప్రతి రోజు దేవుని వాగ్దానము SMS మీ సెల్‌ఫోన్‌లో పొందాలంటే ఈ ఫారమ్ పూర్తి చేసి ఈ దిగువ నున్న అడ్రస్ కు పంపండి. ఒక్క ఫారమ్ ఒక్క నెంబర్‌కే పరిమితం.

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్**
**UNITED PEOPLE'S FELLOWSHIP (UPF)**
# 1-9-52/E/3, Ramnagar, Hyderabad - 500 020. Phone : **27624030/1**

Name / పేరు: ____________________

Address
చిరునామా : ____________________

____________________

____________________ PIN : ☐☐☐☐☐☐

Your Church Name
మీ సంఘము పేరు : ____________________

Mobile Number for SMS subscription / SMS సభ్యత్వం కొరకు సెల్ నంబర్

☐☐☐☐☐☐☐☐☐☐

Date : ........................................ Signature

ప్రార్థించండి! **ప్రకటన** పాల్గొనండి!

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**
**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్-20.**
**Ph : 040-27624030, 27624031**

**ప్రతి ఆదివారము**

**ఉదయకాల ఆరాధన**

**ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు**

స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో

మరియు

**సాయంకాల ఆరాధనలు**

**తెలుగు సా॥ 4 గం॥ల నుండి సా॥ గం॥ 6 గ॥ల వరకు**

**ఇంగ్లీష్ సా॥ 6 గం॥ల నుండి రాత్రి గం॥ 8-30 ని॥ల వరకు**

స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్,
హైదరాబాద్ - 500 044. తెలంగాణ.

**అందరికీ ఆహ్వానము** - జాయ్ చెరియన్

**యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము**

# "జీవపు మాటలు"

**ఆరాధన** ఛానెల్‌లో
ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు

**రక్షణ** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 6.00 గం॥లకు

**మెట్రో** ఛానెల్‌లో (హాత్‌వే నెం. 19)
ప్రతి రోజు రాత్రి 8.00 గం॥లకు మరియు
ప్రతి సోమవారము ఉ॥ 7.00 గం॥లకు

**కల్వరి** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 5.30 గం॥లకు మరియు ఉ॥ 10.00 గం॥లకు

**శుభవార్త** ఛానెల్‌లో
ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు

**గాస్పెల్** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 10.30 ని॥లకు మరియు రా॥ 7.00 గం॥లకు

**సి.టి.ఎన్.** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 6.30 ని॥లకు

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో
– జాయ్ చెరియన్

మా చిరునామా :

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**
**# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు**
**ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి,**
**మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్-20.**
**ఫోన్ : 040-27624030, 27624031**

***VISIT US AT :***
***Email : joycherian@hotmail.com,***
**www. unitedpeoplesfellowship.org**

ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

**www.unitedpeoplesfellowship.org**

**Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,**
**# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,**
**Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 040-27624030, 27624031**
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862